12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :271 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి బుధవారం 7 అక్టోబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :271 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI WED 7 OCTOBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

# ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

## రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు



- నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- గత నెలలో రూ.1,345 కోట్ల పనులు జరిగాయని అధికారులు వెల్లడి
- ఔటర్ రింగ్ రోడ్డుపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం
- ప్రస్తుతం 41 వేల మంది కార్మికులతో కొనసాగుతున్న పనులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా
ఆరా తీశారు.రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.



## టీడీపీ అంతర్గత వివాదాలపై పల్లా శ్రీనివాసరావు దృష్టి..

### నేతలకు కీలక సూచనలు

- తిరువూరు టీడీపీ వివాదంపై రంగంలోకి దిగిన పల్లా శ్రీనివాసరావు
- ఎమ్మెల్యే కొలికపూడి, బాలకోటయ్యలకు కీలక సూచనలు
- దెందులూరు టోల్‌ప్లాజా ఘటనపైనా విచారణ
- చింతమనేని నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న శ్రీనివాసరావు
- క్రమశిక్షణ పాటించాలని నేతలకు స్పష్టం

పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాల పరిష్కారంపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు. తిరువూరు నియోజకవర్గంతో పాటు దెందులూరు ఎమ్మెల్యేకు సంబంధించిన వివాదాలపై ఆయన లోతుగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సంబంధిత నేతలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి, వారి నుంచి వివరణ కోరారు.ముందుగా,

- మిగతా 2లో

## స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ కోటా.. సుప్రీంకోర్టులో గెలుస్తాం

- ఢిల్లీలో న్యాయ నిపుణులతో చర్చలు జరిపిన టీడీపీ నేతలు
- బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని రామ్మోహన్ నాయుడు ప్రశ్న
- బీసీలకు రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల కు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు సుప్రీం కోర్టులోనూ పూర్తి అవకాశం ఉందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ లక్ష్యంతోనే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును

- మిగతా 2లో

## 100 కోట్ల ప్రయాణాలతో 'స్త్రీ శక్తి' చారిత్రాత్మక ఘనత.. చంద్రబాబు హర్షం

- స్త్రీశక్తి పథకం కింద 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు పూర్తి
- రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం
- ఈ పథకం ద్వారా మహిళలకు రూ.3,550 కోట్ల ఆదా జరిగిందన్న సీఎం
- మహిళలతో పాటు ఆర్టీసీ సిబ్బందికి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు

ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకం చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్నారు. ఈ ఘనత పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆదరణ, మాతృమూర్తుల ఆమోదంతోనే ఈ విజయం

- మిగతా 2లో





## వాయు సేన కొత్త అధిపతిగా.. ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్

పెన్ పవర్ డెస్క్:భారత వాయుసేన 29వ నూతన అధిపతిగా ఎయిర్ మా ర్షల్ ఆశుతోష్ దీక్షిత్ నియమితుల య్యారు. ప్రస్తుతం వాయుసేన వైస్ చీఫ్‌గా సేవలందిస్తున్న ఆయన, అక్టోబర్ 31 నుంచి

వివరాలు 2లో..



## 5 అసెంబ్లీ,1 లోక్‌సభకు బైపోల్స్..

### అక్టోబర్ 9న ఎన్నికల ఫలితాలు

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం ,కేంద్రపాలిత ప్రాం తం పుదుచ్చేరిలో ఐదు అసెంబ్లీ స్థానాల కు, ఒక లోక్‌సభ నియోజకవర్గానికి మంగళవారం ఉప ఎన్నికలు జరిగాయి. పోలింగ్ జరిగిన నియోజకవర్గాలలో తమిళనాడులోని

వివరాలు 2లో..



## ఒక్క మిల్లీమీటర్ మా భూభాగంలోకి వచ్చినా తీవ్ర పరిణామాలు తప్పవు

### దక్షిణ కొరియాకు ఉత్తర కొరియా హెచ్చరిక

వివరాలు 2లో..

## ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద ఉద్రిక్తత

### పోలీసుల అదుపులో రాహుల్ గాంధీ, ప్రియాంక..

- సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల భారీ నిరసన
- పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయానికి ఇండియా కూటమి ర్యాలీ
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన రాహుల్ గాంధీ
- రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ సహా పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆకాశవాణి భవన్‌లో బైఠాయించి కొనసాగుతున్న ఆందోళన



పెన్ పవర్ డెస్క్:దేశ రాజధాని ఢిల్లీ మంగళవారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు, హైడ్రామాకు దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను

- మిగతా 2లో



## చిన్న పరిశ్రమలకు రూ.10వేల కోట్లు పెట్టుబడులు..

### రవాణా రంగానికి మాస్టర్ ప్లాన్: కేంద్ర కేబినెట్

**ప్రధాని మోడీ అధ్యక్షతన భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా 2 కీలక చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి రూ.10వేల కోట్ల కేటాయింపుతో పాటు.. రవాణా అండ్ లాజిస్టిక్స్ రంగాన్ని సమన్వయం చేయడానికి 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ' ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.**

పెన్ పవర్ డెస్క్: దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో వృద్ధి దశలో ఉన్న కంపెనీలకు ఈ 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్' ద్వారా ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడులు అందనున్నాయి. ఇప్పటివరకు మార్కెట్లో ఉన్న మెజారిటీ ఫండ్స్ అన్నీ కేవలం ప్రారంభ దశలో ఉన్న మైక్రో పరిశ్రమలకే పరిమితం కావడం వల్ల గ్రోత్-స్టేజ్ క్యాపిటల్ కొరత తీవ్రంగా ఉంది. ఈ లోపాన్ని సరిదిద్దేందుకే ప్రభుత్వం రూ. 10వేల కోట్లతో ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తోందని కేంద్రం వెల్లడించింది.

- మిగతా 2లో

## పాక్ గూఢచర్య నెట్‌వర్క్‌ను ఛేదించిన ఏపీ ఇంటెలిజెన్స్.. ఇద్దరి అరెస్ట్

- ఆపరేషన్ ఫైర్‌వాల్-2026తో పాక్ గూఢచర్య ముఠా గుట్టురట్టు
- విశాఖ నేవీ స్థావరాల సమాచారమే లక్ష్యంగా కుట్ర
- 13 మంది నేవీ సిబ్బంది సహా 18 మందిపై నిఘా
- విశాఖ, కోయంబత్తూర్‌లలో ఇద్దరిని అరెస్ట్ చేసిన అధికారులు
- డబ్బు కోసం రహస్య సమాచారం చేరవేసినట్లు ఆరోపణలు

- మిగతా 2లో





## హార్ముజ్ లో వాణిజ్య నౌకపై క్షిపణి దాడి..

### 11 మంది భారతీయ నావికులకు గాయాలు

పెన్ పవర్ డెస్క్:హార్ముజ్ జలసంధి సమీపంలోని ఒమన్ తీరంలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న ఎంటీ ఆన్ పీస్ వాణిజ్య నౌకపై క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో నౌకలో ఉన్న

- మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్ల భయంతోనే వైసీపీ కోర్టులకు వెళుతోంది

- బీసీల సంక్షేమంపై వైసీపీకి చిత్తశుద్ధి లేదన్న మండిపల్లి
- 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామన్న మంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే విజయమని ధీమా



పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే భయంతోనే వైసీపీ కోర్టులను ఆశ్రయిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

- మిగతా 2లో




# తప్పుకుంటే గౌరవం

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయడమే మంచిదా ? అయన కొనసాగడం వల్ల భవిష్యత్తులో భారత ఎన్నికల వ్యవస్థలో ఏం జరిగినా అందులో తప్పులేకపోయినా ఆయనపైనే విపక్షాలు పడే అవకాశముందని అంటున్నారు. జ్ఞానేశ్ కుమార్ స్వచ్ఛందంగా రాజీనామా చేసి బయటకు వెళ్లడమే మంచిదన్న సూచనలు వినపడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక ఎన్నికల కమిషనర్ మీద ఇలాంటి ఆరోపణలు రావడం బహుశ ఇదే తొలిసారి. అయితే జ్ఞానేశ్ కుమార్ కొనసాగుతూ రానున్న కాలంలో జరిగే ఏ ఎన్నికల్లోనైనా గెలుపోటములకు ఆయనను బాధ్యులుగా చేయడం గ్యారంటీ. అందుకే స్వచ్ఛందంగా తప్పుకోవడం మంచిదని చెబుతున్నారు. జ్ఞానేశ్ కుమార్ వైఖరిపై ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య రక్షణ వేదికలు మరియు కొందరు మాజీ పౌర సర్వీసుల అధికారులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

**నమ్మకం .. విశ్వసనీయత...**

ఎన్నికల సంఘంపై ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత తగ్గుతుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఇతర ఎన్నికల కమిషనర్లను సంప్రదించకుండా జ్ఞానేశ్ కుమార్ దాదాపు 14 సార్లు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. దీనివల్ల ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదనే భావన ప్రజల్లో పెరిగి, భవిష్యత్ ఎన్నికల ఫలితాలపై ప్రజలకు నమ్మకం తగ్గే ప్రమాదం ఉంది. దేశవ్యాప్తంగా చేపట్టిన 'హ×=' ప్రక్రియలో భాగంగా దాదాపు 13 కోట్ల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని, ఇది ఒక వర్గానికి లేదా ప్రతిపక్షాలకు నష్టం చేకూర్చేలా ఉందనే ఆరోపణలు ఉన్నాయి.

**ఫామ్-6 మార్పులతో ...**

కొత్తగా ఓటు నమోదు చేసుకునే ఫామ్-6 లో సుప్రీంకోర్టు అనుమతి లేకుండానే మార్పులు చేశారనే విమర్శలను ప్రతిపక్షాలు లేవనెత్తుతున్నాయి. రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో లక్షలాది మంది అర్హులైన పౌరులు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని విపక్షాలు ఆందోళన చెందుతున్నాయి. ఎన్నికల సంఘంలోని మిగిలిన ఇద్దరు కమిషనర్లు ఓటర్ల డేటాబేస్ భద్రత, కేంద్రీకరణపై లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వచ్చాయి.ముగ్గురు సభ్యుల కమిషన్‌లో సయోధ్య లేకపోతే, భవిష్యత్తులో కీలకమైన ఎన్నికల నిర్వహణ సమయాల్లో త్వరితగతిన, పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతుంది. భారత ప్రధాన న్యాయమూర్తి ని సెలక్షన్ కమిటీ నుంచి తొలగించి, కేంద్ర ప్రభుత్వ మంత్రిని చేర్చుతూ తీసుకువచ్చిన 2023 కొత్త చట్టం ప్రకారం నియమితులైన మొదటి ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్. కేంద్ర ప్రభుత్వ అనుకూల అధికారిగా ఈయనపై ముద్ర పడటం వల్ల, భవిష్యత్తులో ఈసీ తీసుకునే ఏ నిర్ణయాన్నైనా ప్రతిపక్షాలు అంగీకరించే పరిస్థితి ఉండదు. నిరంతరం రాజకీయ ఘర్షణలు... నిరసనలు కొనసాగుతూనే ఉంటాయి.

**పాత కేసులు తెరపైకి రావడం...**

కేరళ కేడర్‌కు చెందిన జ్ఞానేశ్ కుమార్‌పై 20 ఏళ్ల నాటి ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టు అవినీతి, ఒక ఇంజనీర్ ఆత్మహత్యకు సంబంధించిన పాత కేసుపై కేరళ ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది.ఒక అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి విచారణలు ఎదుర్కోవడం వల్ల పదవికి ఉన్న నైతికత దెబ్బతింటుంది.ప్రస్తుతం ఈ అంశాలన్నింటిపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీతో జరగాలని కోర్టు స్పష్టం చేస్తూ, ఈ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది.

## స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ కోటా.. సుప్రీంకోర్టులో గెలుస్తాం

- మొదటి పేజి తరువాయి

ఆశ్రయించిందని తెలిపారు. ఢిల్లీలో ఈరోజు న్యాయనిపుణులతో అచ్చెన్నాయుడు, అనగాని సత్య ప్రసాద్, పార్థసారథి, రామ్మోహన్ నాయుడు చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని ప్రశ్నించారు. వారికి రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 34 శాతం కోటాను పునరుద్ధరిస్తే బీసీలకు సుమారు 16,800 పదవులు దక్కుతాయని... ఇది రాజకీయ అంశం కాదని, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. కొన్ని రాష్ట్రాలు బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే మార్గాలను అన్వేషిస్తున్నాయని, ప్రభుత్వం కూడా సమస్యను జఠిలం చేయకుండా పరిష్కారం కోసం చూస్తోందని వివరించారు.మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం చట్టాన్ని సవరించకుండానే రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి ఎందుకు తగ్గించిందని నిలదీశారు. దీనివల్ల వేలాది మంది బీసీ నేతలు పదవులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 1987లో టీడీపీనే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిందని, ఆ తర్వాత చంద్రబాబు హయాంలో దాన్ని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు.

# 100 కోట్ల ప్రయాణాలతో 'స్త్రీ శక్తి' చారిత్రాత్మక ఘనత.. చంద్రబాబు హర్షం

- మొదటి పేజి తరువాయి

సాధ్యమైందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గత ఏడాది ఆగస్టు 15న ప్రారంభమైన స్త్రీశక్తి పథకం, 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలను పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణం. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారంటే ఈ పథకం వారి జీవితాల్లో ఎంతగా భాగమైపోయిందో అర్థమవుతోంది" అని తెలిపారు. చదువుకునే విద్యార్థినులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే వారికి ఉచిత బస్సు ప్రయాణం ఎంతో శక్తినిచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించి, తమ అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించే భరోసాను ఈ పథకం అందిస్తోందన్నారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా మహిళలు రూ.3,550 కోట్ల మేర ఆదా చేసుకున్నారని, ఇలా ఆదా అయిన ప్రతి రూపాయి వారి పిల్లల చదువుకు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి వివరించారు.ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధ్యం చేసినందుకు రాష్ట్రంలోని మహిళలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా, పథకం విజయవంతం కావడంలో అహర్నిశలు కృషి చేసిన ఆర్టీసీ యాజమాన్యానికి, సిబ్బందికి చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

2024 ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో స్త్రీ శక్తి పథకం ముఖ్యమైనది. ఈ పథకాన్ని 2025 ఆగస్టు 15 నుంచి అమల్లోకి తెచ్చారు.

## పాక్ గూఢచర్య నెట్‌వర్క్‌ను ఛేదించిన ఏపీ ఇంటెలిజెన్స్.. ఇద్దరి అరెస్ట్

భారత నావికాదళానికి చెందిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న పాకిస్థాన్ గూఢచర్య నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం ఛేదించింది. "ఆపరేషన్ ఫైర్‌వాల్-2026" పేరుతో చేపట్టిన ఈ భారీ ఆపరేషన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ముఖ్యంగా విశాఖపట్నంలోని కీలక రక్షణ స్థావరాల సమాచారాన్ని శత్రు దేశానికి చేరవేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

ఈ కేసులో మొత్తం 18 మంది అనుమానితులపై నిఘా పెట్టినట్లు కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. వీరిలో 13 మంది నేవీ సిబ్బంది కూడా ఉండటం సంచలనం సృష్టిస్తోంది. 12 ప్రత్యేక బృందాలు ఏకకాలంలో కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక సహా 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సోదాలు జరిపాయి. నిందితులు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లతో ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ చానెళ్ల ద్వారా సంప్రదింపులు జరిపినట్లు ఆధారాలు సేకరించారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలను విశ్లేషిస్తున్నారు.

అరెస్టయిన వారిలో విశాఖపట్నానికి చెందిన కాంట్రాక్టు డ్రైవర్ అన్నం సాయి వరప్రసాద్ ఒకరు. ఇతను నేవీ, ఇతర రక్షణ స్థావరాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని డబ్బు కోసం పాక్ ఏజెంట్‌కు

చేరవేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అతనికి అక్టోబర్ 14 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, ప్రస్తుతం విశాఖ జిల్లా జైలులో ఉన్నాడు.

రెండో నిందితుడు కోయంబత్తూర్‌కు చెందిన నేవీ ఉద్యోగి ప్రదీప్ ముఖర్జీ. పాకిస్థాన్ ఏజెంట్‌కు సంబంధించిన వాట్సాప్ ఖాతాను యాక్టివేట్ చేయడానికి అవసరమైన ఓటీపీని ఇతను షేర్ చేసినట్లు గుర్తించారు. ట్రాన్సిట్ వారెంట్‌పై అతన్ని విజయవాడకు తరలించారు. ఇతనికి కూడా అక్టోబర్ 14 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించగా, విజయవాడ జిల్లా జైలులో ఉంచారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. మిగిలిన అనుమానితుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది.

## ఒక్క మిల్లీమీటర్ మా భూభాగంలోకి వచ్చినా తీవ్ర పరిణామాలు తప్పవు

ఇరు కొరియాల మధ్య మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు రాజుకున్నాయి. తమ భూభాగంలోకి ఒక్క మిల్లీమీటర్ అడుగుపెట్టినా తక్షణమే, అత్యంత శక్తిమంతంగా ప్రతిఘటిస్తామని ఉత్తర కొరియా మంగళవారం దక్షిణ కొరియాను తీవ్రంగా హెచ్చరించింది. సరిహద్దులో ఇటీవల జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడు ఘటనపై దక్షిణ కొరియా తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.సెప్టెంబర్ 21న ఇరు దేశాల సరిహద్దులోని సైనిక రహిత ప్రాంతం (ఐఫ్జ్) దక్షిణ భాగంలో జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఇద్దరు దక్షిణ కొరియా సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుళ్లకు ఉత్తర కొరియానే కారణమని, వారు ఉద్దేశపూర్వకంగానే మైన్‌లను అమర్చారని దక్షిణ కొరియా సైన్యం దర్యాప్తులో పేర్కొంది. దీనికి ప్రతిస్పందనగా, ఐక్యరాజ్యసమితి కమాండ్ (ఖచీజ) సహకారంతో దక్షిణ కొరియా ఆ ప్రాంతంలో మైన్‌లను తొలగించే ఆపరేషన్‌ను చేపట్టింది. దీన్ని ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాత్మక చర్యగా దక్షిణ కొరియా రక్షణ మంత్రి కాంగ్ షిన్-చుల్ అభివర్ణించారు.

ఈ పరిణామాలపై ఉత్తర కొరియా విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ల్యాండ్‌మైన్ పేలుడుతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆ మేరకు ఆరోపణలను పూర్తిగా ఖండించింది. దక్షిణ కొరియా ఉద్దేశపూర్వకంగా కట్టుకథ అల్లి, తమపై నిందలు వేస్తోందని, అంతర్జాతీయంగా తమ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. "ఒకవేళ దక్షిణ కొరియా సైనికులు సరిహద్దు రేఖను దాటి మా భూభాగంలోకి ప్రవేశిస్తే, మా సరిహద్దు దళాలు తక్షణమే శక్తిమంతమైన ప్రతిచర్య తీసుకుంటాయి" అని ఆ ప్రకటనలో హెచ్చరించింది.ఈ వివాదానికి ప్రధాన కారణం సరిహద్దు రేఖ (వీణూ)పై స్పష్టత లేకపోవడమేనని వాదనలు వినిపిస్తున్నాయి. 1953 యుద్ధ విరమణ ఒప్పందం సమయంలో ఏర్పాటు చేసిన 1,292 సరిహద్దు గుర్తింపు చిహ్నాలలో చాలా వరకు కాలక్రమేణా దెబ్బతినడంతో, ప్రస్తుతం కేవలం 200 మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు రేఖపై నెలకొన్న అనిశ్చితిని పరిష్కరించడానికి చర్చలు జరపాలని దక్షిణ కొరియా ప్రతిపాదించినప్పటికీ, అందుకు తాము సిద్ధంగా లేమని ఉత్తర కొరియా స్పష్టం చేసింది. తమ సార్వభౌమాధికారానికి సంబంధించిన విషయాల్లో చర్చలకు తావులేదని, బల ప్రయోగంతోనే తమ భూభాగాన్ని కాపాడుకుంటామని తేల్చి చెప్పింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

## ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద ఉద్రిక్తత

- మొదటి పేజి తరువాయి

పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వైపు నిరసన ర్యాలీగా బయలుదేరారు. అయితే, ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి, చేతిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ తన నిరసనను తీవ్రతరం చేశారు. అనంతరం ఇతర నేతలతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఢిల్లీ పోలీసులు రంగప్రవేశం చేసి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (యూబీటీ) సహా పలువురు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని బస్సుల్లోకి ఎక్కించారు. ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత లోపించిందని, అవకతవకలు జరుగుతున్నాయని విపక్షాలు గత కొద్ది వారాలుగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని కూడా వార్తలు వచ్చాయి. దీనిపై రాహుల్ సోషల్ మీడియాలోనూ స్పందించారు. "జ్ఞానేశ్, ఇక ముగిసింది. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## చిన్న పరిశ్రమలకు రూ.10వేల కోట్లు పెట్టుబడులు..

- మొదటి పేజి తరువాయి

ఈ ఫండ్ ద్వారా వచ్చే పెట్టుబడులతో ఎస్ఎంఈలు తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడంతో పాటు, ఆధునిక సాంకేతికతను జోడించడం, గ్లోబల్ వాల్యూ చైన్‌లో భాగస్వామ్యం కావడం సులభమవుతుంది. ముఖ్యంగా టైర్-2, టైర్-3 నగరాల్లోని పారిశ్రామిక క్లస్టర్లలో ఉన్న చిన్న, మధ్యతరహా మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లకు ఈ నిధుల్లో ఎక్కువ భాగం కేటాయించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఇక రవాణా రంగానికి సంబంధించి దేశంలో వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు స్పెషల్ పర్పస్ వెహికల్ రూపంలో ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ (ఝూూ) ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రోడ్లు, రైల్వేలు, పోర్టులు, సివిల్ ఏవియేషన్, జలమార్గాలు వంటి అన్ని రవాణా విభాగాలను అనుసంధానిస్తూ ఈ సంస్థ 10 ఏళ్లలో

జాతీయ రవాణా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనుంది. రూ.500 కోట్లు అంతకంటే ఎక్కువ ఖర్చు అయ్యే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల టెక్నికల్ అప్రైజల్‌తో పాటు, జీఎస్టీ ఈ-వే బిల్లులు, ఫాస్టాగ్, వాహన్ వంటి ఆధునిక డాటా సోర్సెస్ ఆధారంగా 'నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ డాటా రిపాజిటరీ'ని కూడా ఝూూ నిర్మించనుంది. తాజా నిర్ణయాలతో దేశంలో లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గి, రవాణా రంగం మరింత వేగవంతమై భారత్ గ్లోబల్ కాంపిటిటివ్‌నెస్‌లో ముందుండేలా కేంద్రం పకడ్బందీ ప్లాన్స్ సిద్ధం చేస్తోంది.

## బీసీ రిజర్వేషన్ల భయంతోనే వైసీపీ కోర్టులకు వెళుతోంది

- మొదటి పేజి తరువాయి

మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రజల్లోకి వెళ్లి పనిచేసే సత్తా వైసీపీకి లేదని, ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా ఆరోపణలు చేయడం, కేసులు వేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని మంత్రి విమర్శించారు. బీసీల సంక్షేమం, వారి రాజకీయ సాధికారతపై వైసీపీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు, రాజ్యాంగ హక్కులకు అనుగుణంగానే తమ కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి అందాయని, 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని మండిపల్లి వివరించారు. గృహ నిర్మాణం, ఉద్యానవన రంగాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీలు పూర్తి సన్నద్ధంగా ఉన్నాయని, ప్రజల మద్దతుతో వార్డు స్థాయి నుంచి మేయర్ పదవి వరకు నిర్ణయాత్మక విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## హోర్ముజ్ లో వాణిజ్య నౌకపై క్షిపణి దాడి..

- మొదటి పేజి తరువాయి

11 మంది భారతీయ నావికులు గాయపడ్డారు. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 19 మంది సిబ్బంది ఉండగా, వారిలో 17 మంది భారతీయులు ఉన్నారు. మొత్తం 12 మంది సిబ్బంది గాయపడగా, వారిలో 11 మంది భారతీయ పౌరులు ఉన్నారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ( మంగళవారం(అక్టోబర్6) ధృవీకరించింది. గాయపడిన సిబ్బందిని ఒమన్ లోని ఖసాబ్ కు తరలించి చికిత్స అందిస్తున్నారని వీజూూ తెలిపింది. గాయపడిన భారతీయ నావికులకు ఒమన్ అధికారులు చేసిన సహాయానికి ధన్యవాదాలు తెలిపింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌక పై దాడిని భారత్ ఖండించింది.ఆ ప్రాంతంలో నౌకా రవాణాపై కొనసాగుతున్న దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. హోర్ముజ్ లో శాంతి నెలకొల్పేందుకు ఇలాంటి దాడులను తక్షణమే నిలిపివేయాలని పిలుపునిచ్చింది. చమురు రవాణాకు ఎంతో కీలకమైన ఈ అంతర్జాతీయ జలమార్గాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కోరింది.

## వాయు సేన కొత్త అధిపతిగా.. ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్

- మొదటి పేజి తరువాయి

ఈ బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అదే రోజున పదవీ విరమణ చేయనున్నారు. ఆశుతోష్ 1986 డిసెంబర్ 6న వాయుసేన ఫైటర్ స్ట్రీమ్‌లో చేరారు. దాదాపు 4 దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయనకు 3వేల500 గంటలకు పైగా విమానాలను నడిపిన అనుభవం ఉన్నది. కార్గిల్ యుద్ధ సమయంలో ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సిందూర్ లో ఆయన కీకల పాత్ర పోషించారు. భారతదేశ రక్షణ రంగంలో స్వయంసమృద్ధి (ఆత్మనిర్భరత) సాధనలో భాగంగా స్వదేశీ యుద్ధ విమానం ౡజూూ తేజస్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో అయనది కీరోల్. దేశానికి ఆయన అందించిన సేవలకు గానూ పీవీఎస్ఎం, ఏవీఎస్ఎం, వీఎం, వీఎస్ఎం వంటి విశిష్ట సేవా పతకాలు లభించాయి.

## టీడీపీ అంతర్గత వివాదాలపై పల్లా శ్రీనివాసరావు దృష్టి..

- మొదటి పేజి తరువాయి

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాలకోటయ్య మధ్య తలెత్తిన విభేదాలపై పల్లా శ్రీనివాసరావు ఆరా తీశారు. ఇరువురితో విడివిడిగా సమావేశమై, వారి మధ్య ఉన్న పరస్పర ఆరోపణలు, పార్టీకి అందిన ఫిర్యాదులపై సమగ్రంగా చర్చించారు. పార్టీ అంతర్గత వ్యవహారాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని, అనవసర వివాదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని వారికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై వచ్చిన టోల్‌ప్లాజా ఘటన ఆరోపణలపైనా పల్లా శ్రీనివాసరావు విచారణ జరిపారు. ఈ ఘటనకు సంబంధించిన వాస్తవాలను చింతమనేని ప్రభాకర్‌ని అడిగి తెలుసుకున్నారు. టోల్‌ప్లాజా సిబ్బంది, లారీ డ్రైవర్లు అందించిన సమాచారం మేరకు ఈ వివాదంతో చింతమనేనికి ఎటువంటి సంబంధం లేదని ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలను పల్లా శ్రీనివాసరావు సేకరించారు.ఈ సందర్భంగా పార్టీ నేతలతో మాట్లాడిన ఆయన, వ్యక్తిగత విమర్శలకు లోనుకాకుండా పార్టీ క్రమశిక్షణను, ఐక్యతను కాపాడాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## 5 అసెంబ్లీ,1 లోక్‌సభకు బైపోల్స్.. అక్టోబర్ 9న ఎన్నికల ఫలితాలు

- మొదటి పేజి తరువాయి

మదు రాంతకం , ధారపురం, పుదుచ్చేరిలోని తట్టన్‌చావడి, పశ్చిమ బెంగాల్‌లోని రేజినగర్ , నందిగ్రామ్, అస్సాంలోని నాగావ్ లోక్‌సభ స్థానం ఉన్నాయి.శుక్రవారం (అక్టోబర్ 9) అన్ని స్థానాలకు ఓట్ల లెక్కింపు జరగనుంది. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రేజినగర్ అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల పోలింగ్ మంగళవారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఈ రెండు నియోజకవర్గాల్లో దాదాపు 79 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని అవాంఛనీయ సంఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఎలక్షన్ అధికారులు తెలిపారు. పూర్వ మేదినీపూర్ జిల్లాలోని నందిగ్రామ్‌లో 79.39 శాతం పోలింగ్ నమోదు కాగా, ముర్షిదాబాద్‌లోని రేజినగర్‌లో సాయంత్రం 5 గంటల వరకు 78.42 శాతం ఓటింగ్ నమోదైంది.మరోవైపు తమిళనాడులోని మదురాంతకంలో 78.86 శాతం, పుదుచ్చేరిలోని తట్టంచవాడిలో 78.83 శాతం ఓటింగ్ నమోదైంది. ధారపురంలో 78.53 శాతం ఓటింగ్ నమోదు కాగా అస్సాంలోని నాగావ్ లోక్‌సభ స్థానంలో 76 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**సువేందు అధికారికి పరీక్ష**

పశ్చిమ బెంగాల్ కు బీజేపీ తొలి సీఎం అయిన సువేందు అధికారి నందిగ్రామ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో ఇప్పుడు అందరి దృష్టి నందిగ్రామ్ పైనే ఉంది. ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో, అధికారి తన కంచుకోట అయిన నందిగ్రామ్‌ను నిలబెట్టుకుంటూనే, భవానిపూర్‌లో మమతా బెనర్జీని ఓడించారు. ఆ తర్వాత భవానిపూర్‌కు ప్రాతినిధ్యం వహించాలని నిర్ణయించుకోవడంతో, నందిగ్రామ్ స్థానం ఖాళీ అయి ఉప ఎన్నిక అనివార్యమైంది. సువేందు అధికారి పీఏ కుమార్తె హసిరానీ రథ్ ను బీజేపీ బరిలోకి దింపింది.

**విజయ్‌కు తొలి ఎన్నికల పరీక్ష**

మధురాంతకం, ధరాపురం ఉప ఎన్నికలు తమిళనాడు సీఎం విజయ్ కి తొలి ఎన్నికల పరీక్షగా నిలవనున్నాయి. ఏప్రిల్ అసెంబ్లీ ఎన్నికలలో గెలిచి అధికారంలోకి వచ్చిన తమిళగ వెట్రి కళగం(ౡఖ) పార్టీకి, సీఎం సి. జోసెఫ్ విజయ్ తొలిసారి బైపోల్స్ ఎదురుకుంటున్నారు. మధురాంతకం ఎమ్మెల్యే మరకతం కుమారవేల్ , ధరాపురం ఎమ్మెల్యే పి. సత్యభామ రాజీనామా చేయడంతో ఈ స్థానాలు ఖాళీ అయ్యాయి. వీరిద్దరూ ఆ తర్వాత ౡఖలో చేరి ఉప ఎన్నికల్లో అధికార పార్టీ తరపున అభ్యర్థులుగా బరిలోకి దిగారు. ఇదిలా ఉంటే మధురాంతకం నియోజకవర్గం నుంచి27 మంది అభ్యర్థులు, ధరాపురం నుంచి30 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

# నెల్లూరు నగర నియోజకవర్గంలో కార్పొరేటర్లుగా పోటీ చేయడానికి పెరుగుతున్న పోటీ

**- ప్రతి డివిజన్లోనూ ఐదు నుంచి పది మంది నాయకుల వరకు పోటీ చేయడానికి ఆసక్తి చూపించడం గమనార్హం..**
**- ఈ సందర్భంగా 39,40 డివిజన్ నేతలతో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమావేశం**

**నెల్లూరు అక్టోబర్ 6 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

డివిజన్ లో రిజర్వేషన్ లు వచ్చిన తరువాత పార్టీ నిర్ణయించిన అభ్యర్థి. విజయానికి అందరూ కలిసి కట్టుగా సమిష్టిగా పనిచేయాలని నాయకులకు సూచన.

నెల్లూరు రాంజీ నగర్ వైసిపి సిటీ ఆఫీస్ లో.. వైఎస్ఆర్సిపి నెల్లూరు నగర నియోజకవర్గం ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తో.. 39,40 డివిజన్ నేతలతో సమావేశమయ్యారు.





**ఈ సందర్భంగా కార్పొరేషన్ ఎన్నికల్లో..** పోటీ చేయాలనుకుంటున్న వారి పేర్లను అధిష్టానానికి పంపుతున్నామని పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు . పార్టీ ఆదేశానుసారం ..కార్పొరేషన్ ఎన్నికల్లో అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు ఉంటుందన్నారు.టికెట్టు ఎవరికి ఇచ్చిన.. అందరూ ఐక్యంగా పనిచేసి .. పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు.

# ఆత్మవిశ్వాసంతో ఎదగాలి.. తరం మార్చే శక్తిగా యువతులు నిలవాలి







**-'ధీరనారి యువతీ సమ్మేళనం'లో విద్యార్థినులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దిశానిర్దేశం**
**- మార్కులు తగ్గాయని నిరాశ చెందొద్దు.. కష్టాలను పంచుకుంటే పరిష్కారం దొరుకుతుంది**
**- ఆడపిల్లలకు 'నువ్వు ఏదైనా సాధించగలవు' అనే నమ్మకం ఇంటి నుంచే రావాలి**
**- తమ కోసం కాకుండా సమాజం కోసం ఆలోచిస్తున్న జెన్‌జీలకు అభినందనలు**

**నెల్లూరు అక్టోబర్ 6 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

చదువులో మార్కులు తగ్గాయని క్షణికావేశంలో నిరాశకు లోనై తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని విద్యార్థినులకు కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు. ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటుందని, కష్టాలు ఎదురైనప్పుడు వాటిని ఒంటరిగా భరించకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులతో పంచుకోవాలని చెప్పారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలు వీఆర్‌సీలో మంగళవారం నిర్వహించిన 'ధీరనారి యువతీ సమ్మేళనం'లో ప్రశాంతి రెడ్డి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు.

**కష్టాన్ని పంచుకుంటే పరిష్కారం**

ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటుందని, కష్టం ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులతో మనసు విప్పి మాట్లాడాలని ఎమ్మెల్యే గారు సూచించారు. మార్కులు తగ్గినంత మాత్రాన జీవితంలో ఏమీ కోల్పోయినట్లు భావించాల్సిన అవసరం లేదని, చదువు ఒకరికి సులభంగా వస్తే మరొకరికి కష్టంగా ఉండొచ్చని, అంతమాత్రాన నిరాశ చెందాల్సిన పనిలేదని అన్నారు. జీవితం వేరు.. జీవనం వేరు అని చెబుతూ, భగవంతుడు ఇచ్చిన జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సూచించారు. తమ పిల్లలను కష్టపడి పెంచుతూ తల్లిదండ్రులు ఎన్నో కలలు కంటారని, వారి ఆశలను ఎప్పుడూ వమ్ము చేయకూడదని విద్యార్థినులను కోరారు.

**తరం మార్చే యువతిగా ఎదగాలి**

సమ్మేళనం నినాదమైన 'తలవంచేది కాదు.. తరం మార్చేది యువతి' అనే సందేశాన్ని ఎమ్మెల్యే తనదైన శైలిలో వివరించారు. అవసరం లేని చోట ఎవరికీ తలవంచకుండా ఆత్మగౌరవంతో నిలబడాలని, అదే సమయంలో కుటుంబ బంధాల్లో సర్దుకుపోయే సంస్కారం, పెద్దలను గౌరవించే గుణం కూడా ఉండాలని చెప్పారు. ఆడపిల్లల్లో ఆత్మవిశ్వాసం ఇంటి నుంచే, ముఖ్యంగా తల్లి నుంచే ప్రారంభం కావాలని అన్నారు. 'నువ్వు ఏదైనా సాధించగలవు' అనే నమ్మకాన్ని తల్లిదండ్రులు చిన్ననాటి నుంచే పిల్లల్లో నింపాలని ఆకాంక్షించారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలన్న మాటను గుర్తుచేస్తూ, ఉద్యోగం, ఉన్నత స్థానం సాధించడంతో పాటు కుటుంబాన్ని చక్కగా తీర్చిదిద్దడం కూడా మహిళ జీవితంలో ముఖ్యమైన విజయమేనని చెప్పారు. నైతిక విలువలతో కూడిన బిడ్డలను సమాజానికి, దేశానికి అందించినప్పుడే ప్రతి తల్లి, ప్రతి మహిళ నిజమైన విజయాన్ని సాధించినట్టవుతుందని అన్నారు.

**జెన్‌జీలలో సేవా దృక్పథం**

ఇటీవల పలు కళాశాలల్లో విద్యార్థులతో మాట్లాడినప్పుడు వారి ఆలోచనా విధానం, తమ భవిష్యత్తుపై ఉన్న స్పష్టత తనను ఎంతో ఆకట్టుకున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. తమకేం కావాలో స్పష్టంగా తెలుసుకున్న నేటి తరం, వైద్యులు, ఇంజినీర్లు కావాలనే సంప్రదాయ లక్ష్యాలతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, విభిన్న రంగాల్లో రాణించాలని లక్ష్యాలు పెట్టుకుంటోందన్నారు. కొందరు విద్యార్థులు తమ వ్యక్తిగత అవసరాల కోసం కాకుండా, 'మా ఊరికి ఇది లేదు మేడమ్.. మా ఊరికి అది లేదు మేడమ్' అంటూ తమ గ్రామాల సమస్యలను ప్రస్తావిస్తున్నారని చెప్పారు. చిన్న వయసులోనే సమాజం కోసం ఆలోచిస్తూ ప్రజాసేవ పట్ల ఆసక్తి చూపుతున్న నేటి యువతను అభినందించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఓటమికి చోటివ్వకండి**

జీవితంలో ఎక్కడైనా ఎదురుదెబ్బ తగిలినా వెనక్కి తగ్గకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. 'ఓడిపోతాం' అనే ఆలోచనకు చోటివ్వకుండా, 'ఇది కాకపోతే ఇంకొకటి' అనే సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. ఓకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరం కృషి చేస్తే విజయం తప్పక సాధ్యమవుతుందని అన్నారు. మీరే దేశ భవిష్యత్తు అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమానికి తనను ఆహ్వానించిన ఏబీవీపీ నిర్వాహకులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

# వీఆర్‌సీ గ్రౌండ్‌కు కొత్త కళ క్రీడలు, ఆరోగ్యానికి పెద్దపీట.







**- ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్**
**- ప్రభుత్వ పాఠశాలల్లోనూ క్రీడా సదుపాయాల కల్పన**
**- వీఆర్ హైస్కూల్ రాష్ట్రానికే ఆదర్శం: మంత్రి నారాయణ**

**నెల్లూరు, అక్టోబరు 6 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు నగర నడిబొడ్డున ఉన్న వీఆర్‌సీ గ్రౌండ్‌కు కొత్త హంగులు అద్దేందుకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శ్రీకారం చుట్టింది. విద్యార్థులు, వాకర్స్, క్రీడాకారులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్ల నిర్మాణ పనులకు తన కుమార్తె షరణితో కలిసి శంకుస్థాపన చేశారు. బాస్కెట్‌బాల్ కోర్టును కూడా ఆధునీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చదువులతో పాటువిద్యార్థుల్లోక్రీడాప్రతిభనుపెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. వీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఇండోర్, అవుట్‌డోర్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్థలం అందుబాటులో ఉన్న ప్రభుత్వహైస్కూళ్లలోనూ స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేసేందుకుచర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**18 పాఠశాలలకు ఆధునిక హంగులు**

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 18 ప్రభుత్వ హైస్కూళ్లనుఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రంలోని పలు ప్రాంతాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని,

ఈ పాఠశాలకు స్వచ్ఛ అవార్డు కూడా లభించిందని చెప్పారు. అదే స్ఫూర్తితో డీఎస్సార్, ఆర్‌ఎస్‌ఆర్ పాఠశాలలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రారంభించామని తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి తన స్నేహితులు, పూర్వ విద్యార్థులు, ఉన్నత స్థాయిలో ఉన్న తన పరిచయస్తుల సహకారాన్ని తీసుకుంటానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల అభివృద్ధిని అభినందిస్తుంటే వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని,వారి అవాకులు, చవాకులను నేను పట్టించుకోనన్నారు.పేద విద్యార్థులకు మెరుగైన విద్య, క్రీడా సదుపాయాలు అందించడమే మా లక్ష్యమని స్పష్టం చేశారు.అనంతరం 14వ డివిజన్‌లోని ఎంఎస్‌ఎం హైస్కూల్, మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలను మంత్రి పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో చేపట్టాల్సిన ఆధునీకరణ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, క్రీడా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

**డాక్టర్ పోకల రవికి ప్రశంసాపత్రం**

వీఆర్‌సీ గ్రౌండ్‌లో జెండా పోల్ ఏర్పాటుకు రూ.20 వేల విరాళం అందించిన డాక్టర్ పోకల రవిని మంత్రి నారాయణ అభినందించారు. విద్యాశాఖ




మంత్రి నారా లోకేశ్ పంపిన ప్రశంసాపత్రాన్ని ఆయనకు అందజేశారు.

వీఆర్‌సీ గ్రౌండ్‌లో మెరుగైన సదుపాయాల కోసం తమ కోరికను నెరవేరుస్తున్న మంత్రి నారాయణకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో మంత్రి నారాయణ పాల్గొన్నారు. కేక్ కట్ చేయించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హిమబిందు, ఎస్‌ఈ జానీ, డీఈవో బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు యశ్వంత్‌రెడ్డి, డాక్టర్ పోకల రవి, సుజన్, పిట్టి సత్యనాగేశ్వరరావు,ఏడుకొండలు,వాకర్స్అసోసియేషన్ సభ్యులు సుబ్బారెడ్డి, బాబు, నన్నే సాహెబ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్ రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# YCP నాయకులు సింగంశెట్టి అశోక్ ని పరామర్శించిన.. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి.

**నెల్లూరు అక్టోబర్ 6 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు అపోలో హాస్పిటల్ లో.. అస్వస్థతకి గురై చికిత్స పొందుతున్న వైఎస్ఆర్సిపి నెల్లూరు నగర నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సింగంశెట్టి అశోక్ ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు.

ఈ సందర్భంగా.. అశోక్ తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని చంద్రశేఖర్ రెడ్డి అడిగి తెలుసుకుని.. అధైర్య పడవద్దని సూచించారు.



# నెల్లూరు నగర కార్పొరేషన్ ఎన్నికల నగారా మోగడంతో వైఎస్సార్సీపీలో టికెట్ల కోసం పోటీ నెలకొంది.



**- నగరంలోని ప్రతి డివిజన్ నుంచి ప్రముఖ నాయకులు పోటీ చేయడానికి ఆసక్తి**

**నెల్లూరు అక్టోబర్ 6 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

ఈ నేపథ్యంలో నెల్లూరు నగర ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సూచనతో , 47, 49 డివిజన్లకు చెందిన అందుబాటులో ఉండే ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొణిదల సుధీర్ , జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయకృష్ణారెడ్డి పాల్గొని, టికెట్లు ఆశిస్తున్న నేతల అభిప్రాయాలను సేకరించారు. వ్యక్తిగత పనులతో హాజరు కాని నాయకుల అభిప్రాయాలను కూడా ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు .

పోటీ చేయాలనుకుంటున్న నాయకుల వివరాలను క్రోడీకరించి పార్టీ తో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని, అందులో భాగంగా పోటీ చేసే అభ్యర్థులకు అందరూ కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

# వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**-రామతీర్థంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో వరుణ యాగం**
**-రైతులు, మత్స్యకారులు, మహిళలతో కలిసి యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే**
**-రాష్ట్రవ్యాప్తంగా వరుణ యాగాలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ధన్యవాదాలు**
**-కోవూరు నియోజకవర్గంలో ఈ ఏడాది పంటలు బాగా పండాయి.. రైతుల్లో ఆనందం**

**నెల్లూరు అక్టోబర్ 6 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, మత్స్యకారులు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు కోవూరు నియోజకవర్గం విడవలూరు మండలం రామతీర్థంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వరుణ యాగం నిర్వహించారు. కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు, మత్స్యకారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో యాగాన్ని పూర్తి చేశారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ..**

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, దేవాదాయశాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వరుణ యాగాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వర్షాలు సమృద్ధిగా కురవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు.

రైతులు, మత్స్యకారులు అధికంగా ఉన్న విడవలూరు మండలంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ప్రత్యేకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అందులోనూ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఇందుకోసం ఎంపిక చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్వాముల ఆధ్వర్యంలో వరుణ జపం, యాగం నిర్వహించామని, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు.



వరుణ దేవుడి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, మత్స్యకారులకు మంచి రోజులు రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి ఎమ్మెల్యే గారు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి కుటుంబంపై స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

కోవూరు నియోజకవర్గంలో ఈ ఏడాది రైతులు ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. విడవలూరు మండలంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పంటలు బాగా పండాయని, రైతుల ముఖాల్లో ఆ సంతోషం కనిపిస్తోందని చెప్పారు. ముఖ్యంగా పుట్టి వడ్లకు రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలుకుతోందని, ఇంత మంచి ధర గతంలో ఎప్పుడూ చూడలేదని రైతులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇకపై కూడా ఇదే విధంగా ప్రకృతి అనుకూలించి పంటలు బాగా పండాలని, రైతులకు మంచి దిగుబడులతో పాటు గిట్టుబాటు ధరలు లభించాలని శాసనసభ్యులు ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు. రైతులు, మత్స్యకారులు, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ స్వామివారిని ప్రార్థించారు.

# శ్రీశైలంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం.



**శ్రీశైలం పెన్ పవర్ అక్టోబర్ 06**

శ్రీభ్రమరాంబా మల్లిఖార్జున స్వామి దేవాలయంలో జరుగనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబును శ్రీశైలం ఎమ్మెల్యే, దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు ఆహ్వానం పలికారు. ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, ఆలయ బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈవో యం.శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందించారు. శ్రీశైల దేవస్థానం ఆలయ పండితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదాశీర్వచనం పలికారు. సీఎంకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల చిత్రపటం, ప్రసాదాలను దేవాలయ అధికారులు అందించారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.

# తొట్టంబేడు మండలంలో బీజేపీ కార్యవర్గ సమావేశం





**- పంచాయతీ ఎన్నికలకు సమర సన్నద్ధం.. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి పిలుపు**

**తొట్టంబేడు ,పెన్ పవర్, అక్టోబర్ 06:**

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పిల్లమేడు గ్రామంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల కమిటీ కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. బీజేపీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు వెడాం కిష్టయ్య, పార్టీ నాయకులు గురవయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని మండల ఇన్‌చార్జ్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.వి. అమర్‌నాథ్ పర్యవేక్షించారు.

ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షులు మెళగారం సుబ్రహ్మణ్యం రెడ్డి హాజరయ్యారు. నెలవారీ సంస్థాగత సమీక్షలో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ ప్రస్తుత పరిస్థితి, గ్రామస్థాయిలో సంస్థాగత బలోపేతం, రాబోయే పంచాయతీ ఎన్నికలకు పార్టీ శ్రేణుల సన్నద్ధత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీని గ్రామీణ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు విస్తృతంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వాటి ప్రయోజనాలను ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు.

పంచాయతీ ఎన్నికలకు సమర సన్నద్ధం

రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంపై సమావేశంలో ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు, బూత్ స్థాయి ఇన్‌చార్జీలు చురుగ్గా పనిచేస్తూ ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పుల్లయ్య నాయుడు, గురవయ్య, మండల ప్రధాన కార్యదర్శులు కుమార్, బాలాజీ, సురేష్, నాయకులు శేఖర్ నాయుడు, పవన్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, శివ, అంకయ్య తదితరులతో పాటు మండల, గ్రామస్థాయి నాయకులు, బూత్ ఇన్‌చార్జీలు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్షాలు విస్తారంగా కురవాలి-వరుణ యాగంలో మంత్రి నారాయణ





**- ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావం**
**- రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వరుణ యాగాలు: మంత్రి**

**నెల్లూరు, అక్టోబరు 6 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురిసి జలాశయాలు నిండాలని, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆకాంక్షించారు. నెల్లూరు సిటీ మూలాపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగంలో మంత్రి నారాయణ తన కుమార్తె షరణితో కలిసి పాల్గొన్నారు. యాగంలో పూర్ణాహుతి సమర్పించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. సాధారణంతో పోలిస్తే వర్షపాతం 54 శాతం తక్కువగా నమోదైందని చెప్పారు. ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉందన్నారు.

ఇటీవల కురిసిన వర్షాలతో ఉత్తరాంధ్రలో పరిస్థితి కొంత మెరుగుపడిందని తెలిపారు. అయితే రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ విస్తారంగా వర్షాలు కురవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సాగు చేసుకునేందుకు అవసరమైన నీరు అందుబాటులోకి రావాలని, ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలని ప్రార్థించానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలుసమృద్ధిగాకురవాలనిముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు ఆకాంక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వరుణ యాగాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జనార్దన్, ఈవో జానకి, ఆలయ చైర్మన్ వేలూరు పెంచలరాజు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, డివిజన్ టీడీపీ నేతలు గండవరం నాని, అన్నంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏర్పేడులో ఘనంగా అభివృద్ధి కార్యక్రమాలు




**- రూ.69.30 లక్షలతో నిర్మించిన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల భవనం ప్రారంభం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**ఏర్పేడు,పెన్ పవర్,అక్టోబర్ 06:**

ఏర్పేడు మండలంలో బుధవారం (అక్టోబర్ 7) పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు తెలిపారు. మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

బుధవారం సాయంత్రం 3:30 గంటలకు ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ డబ్ల్యు పి & బి (2026) నిధుల కింద రూ.69.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల భవనాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. విద్యార్థులకు ఆధునిక వసతులు అందుబాటులోకి రావడంతో శాస్త్రీయ దృక్పథం, ప్రయోగాత్మక విద్యకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని నాయకులు పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం 4:30 గంటలకు తిరుపతిశ్రీకాళహస్తి బైపాస్ మార్గంలోని మేర్లపాక టోల్ ప్లాజా సమీపంలో ‘జమ్ జమ్’ హోటల్ ప్రారంభోత్సవం జరగనుంది.

ఈ రెండు కార్యక్రమాలకు ఏర్పేడు మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పేరం నాగరాజ నాయుడు కోరారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు.

## శ్రీకాళహస్తి ఎంజీఎం స్కూల్ విద్యార్థినికి జాతీయ స్థాయి కరాటేలో ప్రథమ బహుమతి




**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 06:**

క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ శ్రీకాళహస్తి ఎంజీఎం స్కూల్‌కు చెందిన రెండో తరగతి విద్యార్థిని కె. ప్రియదర్శిని జాతీయ స్థాయిలో సత్తా చాటింది. చెన్నైలో అక్టోబర్ 4వ తేదీన నిర్వహించిన అండర్7 సంవత్సరాల విభాగం జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రియదర్శిని పాల్గొని ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా ఎంజీఎం ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ శ్రీమతి గుద్లూరు ఐశ్వర్య మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విద్యతో పాటు క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు తమ విద్యాసంస్థలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చిన ప్రియదర్శినిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికిఎదగాలనిఆకాంక్షించారు. ప్రియదర్శిని సాధించిన ఈ విజయం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ గుద్లూరు ఐశ్వర్య, హెడ్‌మాస్టర్ మునిరత్నం నాయుడు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పొదలకూరు శ్రీ పోలేరమ్మ జాతరకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు





**- 60 వేల మందికి పైగా తరలిరానున్న భక్తజనం**
**-భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు**
**- అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి**

**నెల్లూరు అక్టోబర్ 6 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

2019 తర్వాత ఆగిపోయిన పనులన్నీ శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులతో పూర్తి కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను

పొదలకూరు ఆర్&బీ అతిథిగృహంలో శ్రీ పోలేరమ్మ తల్లి జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేసిన సోమిరెడ్డి

**సోమిరెడ్డి మాట్లాడుతూ**

ఎన్నో దశాబ్దాల తర్వాత పొదలకూరులో శ్రీ పోలేరమ్మ తల్లి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించు కుంటుండటం సంతోషంగా ఉందిఈ రోజు ప్రారంభమైన జాతర మహోత్సవం గురువారం సాయంత్రం వరకు కొనసాగనుంది.

జాతరలో ముఖ్యమైన గురువారం 45 వేల నుంచి 60 వేల మంది వస్తారని అధికారులు అంచనా వేశారు

భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ముందుకు సాగాలి

అమ్మవారి దర్శనంతో పాటు ఊరేగింపు తదితర కార్యక్రమాల్లో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా 200 మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వర్తిస్తారు.

క్యూలు, బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు నిఘా కోసం తాత్కాలికంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు..డ్రోన్లు కూడా పర్యవేక్షిస్తుంటాయి గురువారం మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ ను చాటగొట్ల నుంచి బిరదవోలు వైపు మళ్లిస్తారు పట్టణంలో ఐదు చోట్ల ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు .

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతుంది భక్తుల దాహార్తి తీర్చేందుకు 35 వేల వాటర్ ప్యాకెట్లు, 1000 వాటర్ బాటిల్స్ తో పాటు దాతల సహకారంతో మరో 3 వేల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించమని పంచాయతీ అధికారులకు సూచించాం...మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు కూడా జాతర వద్ద పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తారు

చెత్తాచెదారాల తొలగింపునకు 100 మందికి పైగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించాను

శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటుకున్నాను .

2019 తర్వాత ఆగిపోయిన కీలక ప్రాజెక్టులు పూర్తి కావాలని, సోమశిల దక్షిణ కాలువ, దేగపూడి బండేపల్లి కాలువ, మెగా మినరల్ వాటర్ ప్లాంట్ ప్రయోజనాలు ప్రజలకు అందాలని ఆకాంక్షిస్తున్నాను

సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ పనులను కూడా త్వరలో ప్రారంభించబోతున్నాం...

అమ్మవారి ఆశీస్సులతో పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆశిస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రిలయన్స్ ఇండస్ట్రీస్ తో కలిసి లక్ష కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లో రాయలసీమ, ప్రకాశం జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలోని మెట్ట ప్రాంతాన్ని కూడా భాగం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడికి విన్నవిస్తున్నాను.

మా సంకల్పాలకు శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులు తప్పకుండా ఉంటాయని నమ్మకం మాకుందన్నారు.

# నలబై ఏళ్ల కల నెరవేరింది.. పల్లిపాడులో విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం:

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి









**-మాటిస్తే నెరవేర్చే ప్రభుత్వం కూటమిది పేదలకు నాణ్యమైన వైద్యమే ప్రాధాన్యత**
**-రాష్ట్రంలో రూ.1,128 కోట్లతో 4,472 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణం**
**-ఇందుకూరుపేట మండలంలో రూ.1.44 కోట్లతో 4 నూతన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభం**
**-డిసెంబరు 1 నుంచి అర్హులందరికీ కొత్త పింఛన్లు ప్రతి ఒక్కరికీ ఇల్లు, ఇంటి స్థలం ఇచ్చి తీరుతాం**
**-పెన్నానది పొర్లుకట్ట పెద్ద ప్రాజెక్టు సీఎం దృష్టికి తీసుకెళ్లాం, తప్పకుండా మంజూరు చేయిస్తాం**
**-మనస్పర్థలు పక్కనబెట్టి కూటమి నాయకులు కలసికట్టుగా సాగాలి స్థానిక ఎన్నికల్లో విజయమే ధ్యేయం**

**నెల్లూరు అక్టోబర్ 6 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు పల్లెల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఇందుకూరుపేట మండలం, పల్లిపాడు గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ‘పల్లె పండుగ 3.0’ కింద సీసీ రోడ్డు పనులతో పాటు ఉపాధి హామీ, ఎంపీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసంగించారు.

**గ్రామాల్లోనే మెరుగైన వైద్యం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, పల్లిపాడు గ్రామంలో గత 40 ఏళ్లుగా హెల్త్ క్లినిక్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానికులు తన దృష్టికి తెచ్చారని, వారి కష్టాలను తీరుస్తూ ఈరోజు క్లినిక్‌ను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 24 జిల్లాల్లోని 87 నియోజకవర్గాల్లో రూ.103 కోట్లతో నిర్మించిన 267 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 4,472 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1,128 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు.

అందులో భాగంగా మన ఇందుకూరుపేట మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.1.44 కోట్లతో కొరుటూరు, సోమరాజుపల్లి, ఇందుకూరుపేట బిట్స్, పల్లిపాడు ప్రాంతాల్లో ఒక్కో క్లినిక్‌ను రూ.36 లక్షలతో నిర్మించామని తెలిపారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే వైద్య సేవలు అందుతాయని, డాక్టర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. పల్లెల్లో ఎంతో నిబద్ధతతో సేవలు అందిస్తున్న వైద్య బృందానికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**పల్లె పండుగ 3.0తో పల్లెల ప్రగతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మన జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.11,300 కోట్లతో ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అందులో భాగంగా కోవూరు నియోజకవర్గానికి రూ.9.60 కోట్లు కేటాయించగా, 217 అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా పల్లిపాడు గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో ‘పల్లె పండుగ 2.0’ కింద రూ.10 కోట్లతో డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు దాదాపు రూ.800 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు.

**కొత్త పింఛన్లు అర్హులందరికీ ఇళ్ల స్థలాలు**

గత ప్రభుత్వం చేసిన అస్తవ్యస్త పనుల వల్ల గృహ నిర్మాణ శాఖలో అనేక సమస్యలు తలెత్తాయని, అవన్నీ సరిదిద్ది అర్హులైన ప్రతి పేదవారికీ ఇల్లు, ఇంటి స్థలం ఇచ్చి తీరుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డిసెంబరు 1వ తేదీ నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్లు అందిస్తామని స్పష్టం చేశారు.

**పెన్నానది పొర్లుకట్ట నిర్మాణానికి కృషి చేస్తాం**

పెన్నానదిలో వరద ప్రవాహం పెరిగిన సమయంలో పొర్లుకట్ట వద్ద అక్కడక్కడా కట్టలు కోతకు గురై కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ సమస్య లేకుండా పెన్నానదికి రక్షణగా పొర్లుకట్ట నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశాన్ని నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో హోం మంత్రి దృష్టికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకెళ్లామని ఎమ్మెల్యే తెలిపారు. ఇది పెద్ద ప్రాజెక్టు కావడంతో మంజూరుకు కొంత సమయం పడుతోందని, తప్పకుండా మంజూరు చేయించి పొర్లుకట్ట నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

**స్థానిక ఎన్నికల్లో కూటమి గెలుపే సీఎం చంద్రబాబు కి బహుమానం**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని ఇందుకూరుపేట మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఒకే కుటుంబంలో అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు వచ్చినట్లే, రాజకీయాల్లో చిన్నచిన్న అభిప్రాయభేదాలుఉండటంసహజమని, నాయకులందరూ ఒకచోట కూర్చొని మాట్లాడుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కూటమి నాయకులందరూ తనకు సమానమేనని స్పష్టం చేశారు. ఇందుకూరుపేట మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అన్ని స్థానాలు గెలుచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి కానుకగా ఇవ్వాలని కోరారు.

# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 06:**

పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచే లక్ష్యంతో మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డు కాలనీ మెయిన్ రోడ్డు, ఎస్ఆర్ఎన్ కాలనీ మెయిన్ రోడ్డు, బజార్ స్ట్రీట్‌లోని గాలి గోపురం సమీప ప్రాంతం, విజయలక్ష్మి హాల్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

రోడ్లు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం పనిచేయాలని, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు ఎలాంటి



ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ప్రధాన రహదారులు, కాలనీలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను






నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# రాచగున్నేరిలో పల్లె పండుగ 3.0 గ్రామసభ

- రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులపై గ్రామస్తుల అభిప్రాయ సేకరణ
- పాఠశాల మీదుగా రహదారి నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేసిన గ్రామస్తులు

**శ్రీకాళహస్తి రూరల్ ,పెన్ పవర్,అక్టోబర్ 06:**

శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి గ్రామంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. మండల ఎంపీడీవో పెంచలశ్యామ్ పాల్గొని గ్రామసభను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కోసం సుమారు రూ. 1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై గ్రామస్తుల నుంచి ప్రజాభిప్రాయాలను సేకరించారు.

ఈ సందర్భంగా ప్రతిపాదిత రహదారి విస్తరణ, నిర్మాణ పనులపై గ్రామస్తులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రహదారి నిర్మాణం ప్రభుత్వ పాఠశాల పరిసరాల మీదుగా కొనసాగనున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల వద్ద రహదారి ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అందువల్ల ప్రతిపాదిత రహదారి నిర్మాణాన్ని మరోసారి పరిశీలించి, గ్రామానికి ప్రయోజనం కలిగే విధంగా ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను కోరారు.

గ్రామసభలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో రహదారి వెడల్పు ప్రతిపాదనకు వ్యతిరేకంగా 49 శాతం మంది తమ అభిప్రాయాన్ని వెల్లడించినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని వారు కోరారు.

ఎంపీడీవో పెంచలశ్యామ్ మాట్లాడుతూ, పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా రాచగున్నేరి గ్రామంలో గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో సుమారు రూ. 1.50 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజల అభిప్రాయాలను నమోదు చేసి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.



గ్రామస్తులు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రతిపాదిత రహదారి నిర్మాణం వల్ల పాఠశాల విద్యార్థుల భద్రతకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందునే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామానికి ఉపయోగపడే విధంగా రహదారి నిర్మాణాన్ని పునఃపరిశీలించాలని కోరారు.అలాగే, ప్రతిపాదిత అభివృద్ధి పనుల్లో కొన్ని పనులు గ్రామంలోని ఒక ప్రైవేటు పరిశ్రమకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉన్నాయనే అభిప్రాయాన్ని కొందరు గ్రామస్తులు వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా పనులు చేపడితే న్యాయపరమైన మార్గాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని వారు అధికారులను హెచ్చరించారు. గ్రామ ప్రజల భద్రత, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు.

# కూటమి ప్రభుత్వం లక్ష్యం పేదల సొంతింటి కల సాకారం: రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

- నంద్యాలలో ఘనంగా 233 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి ఫరూక్

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 06**

రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు . నంద్యాల మార్కెట్ యార్డులో పేదలకు ఉచిత ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా అర్బన్ పరిధిలో 173 మందికి, రూరల్ పరిధిలో 60 మందికి కలిపి మొత్తం 233 మంది అర్హులైన లబ్ధిదారులకు మంత్రి ఫరూక్ చేతుల మీదుగా పట్టాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు



చేస్తోందన్నారు . కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమేనని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు అనేది ఎంతో కీలకమని, ఆ కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన పేదలకు ఎటువంటి పక్షపాతం లేకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి స్థలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నంద్యాల అర్బన్ పరిధిలో



173 మందికి, రూరల్ పరిధిలో 60 మందికి కలిపి మొత్తం 233 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేశామని తెలిపారు

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, సబ్ కలెక్టర్ మనీషా, ట్రైన్ సబ్ కలెక్టర్ ప్రియాంక , టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, ఎమ్మార్వోలు శ్రీవాణి , శ్రీనివాసులు, ఎంపీడీవో సుగుణ శ్రీ , మాజీ కౌన్సిలర్ మిద్దె ఉసేని , మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి , నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్ , అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# అక్టోబర్ 7న నంద్యాల కలెక్టరేట్‌లో ఉద్యోగ మేళా

- అర్హత కలిగిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల, ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 06:-**

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 7వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు నంద్యాల కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో అపోలో టైర్స్ లిమిటెడ్ (ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్), టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలకు సంబంధించిన ఉద్యోగాల కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అపోలో టైర్స్‌లో డిప్లొమా, ఐటీఐ (ఎన్‌సీవీటీ తప్పనిసరి), డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అవకాశాలుఉండగా, అభ్యర్థుల వయస్సు 18 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాల తెలిపారు. శారీరకప్రమాణాల్లో కనీసం 163 సెం.మీ. ఎత్తు,50కిలోలబరువుఉండాలనిసూచించారు.

అదేవిధంగాటాటాఎలక్ట్రానిక్స్‌లో మొబైల్ అసెంబ్లీ విభాగంలో అసోసియేట్ ఉద్యోగాలకు 10వ తరగతి, 12వ తరగతి, డిప్లొమా, ఐటీఐ లేదా ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని, 18 నుంచి 32 సంవత్సరాల వయస్సు కలిగిన వారు హాజరుకావచ్చని కలెక్టర్ తెలిపారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రెజ్యూమ్/సీవీ, విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ యువత ముందస్తుగా kaushalam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు



అందుబాటులోకి వచ్చిన ఈ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ ఎంపిక ప్రక్రియలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

# 31 ఏళ్ల అనురాగ బంధం.. బియ్యపు దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు

- శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శ్రీవాణి రెడ్డి దంపతులకు 31వ వివాహ వార్షికోత్సవ శు భాకాంక్షలు

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 06:**

శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు శ్రీ బియ్యపు మధుసూదన్ రెడ్డి ,శ్రీమతి బియ్యపు శ్రీవాణి రెడ్డి తమ 31వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగాపలువురుఅభిమానులు, శ్రేయోభిలాషులు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

మూడు దశాబ్దాలకు పైగా సాగిన దాంపత్య ప్రయాణంలోఅనురాగం,ఆత్మీయత,పరస్పరఅవగాహన , సహకారం వంటి విలువలను కొనసాగిస్తూ బియ్యపు దంపతులు తమ జీవిత ప్రయాణాన్ని ఆనందంగా కొనసాగిస్తున్నారు. 31వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

ఈ సందర్భంగా శ్రేయోభిలాషులు మాట్లాడుతూ..



బియ్యపు దంపతుల దాంపత్య బంధం మరింత సంతోషంగా, ప్రేమానురాగాలతో వర్ధిల్లాలని, వారి జీవితంలో ప్రతి రోజు కొత్త ఆనందాలను తీసుకురావాలని ఆకాంక్షించారు.

శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులతో బియ్యపు మధుసూదన్ రెడ్డిశ్రీవాణి రెడ్డి దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో కలకాలం ఆనందంగా జీవించాలని, భవిష్యత్తులో మరెన్నో వివాహ వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.





# దసరా నవరాత్రులకు శ్రీకాళహస్తిలో బొమ్మలకొలువు ప్రత్యేక ఆకర్షణ! దేవతామూర్తులను విరాళంగా అందించిన దేవస్థాన డోలు విద్వాంసుడు మల్లికార్జున్





**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 06:**

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా నవరాత్రుల సందర్భంగా నిర్వహించనున్న బొమ్మలకొలువు కార్యక్రమానికి ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మన సంప్రదాయ వైభవాన్ని చాటిచెప్పేలా బొమ్మలకొలువును ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు.

ఈ సందర్భంగా దేవస్థాన డోలు విద్వాంసులు శ్రీ మల్లికార్జున్ పలు రకాల దేవీ దేవతా మూర్తులను విరాళంగా సమర్పించారు. భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేలా, సాంప్రదాయ పద్ధతిలో బొమ్మలకొలువును ఆకర్షణీయంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

విరాళంగా అందించిన దేవతామూర్తులను దేవస్థాన ఈఓ శ్రీ బి.కె. వెంకటేశులు, బోర్డు సభ్యులు శ్రీ గురప్ప శెట్టి సమక్షంలో ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు మల్లికార్జున్‌ను అభినందిస్తూ, ఆలయ కార్యక్రమాలకు భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.

దసరా నవరాత్రుల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి సన్నిధిలో నిర్వహించనున్న బొమ్మలకొలువు భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా ఉండనుందని దేవస్థాన వర్గాలు తెలిపారు.

# వృద్ధుల సేవే సమాజానికి నిజమైన గౌరవం

- శివనాధపురం అమ్మ ఆశ్రమంలో ఘనంగా వృద్ధుల దినోత్సవం వృద్ధులకు చీరల పంపిణీ, అన్నదానం

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 06:**

శ్రీకాళహస్తి మండలం శివనాధపురం గ్రామంలోని అమ్మ ఆశ్రమంలో వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు చీరలు పంపిణీ చేయడంతో పాటు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బొజ్జల బృందమ్మ, గరికపాటి రమేష్‌బాబు, గంగపుత్ర గాంధీ, రచయిత, ఆశ్రమ నిర్వాహకులు భూ లక్ష్మమ్మ పాల్గొన్నారు. వృద్ధులతో ఆప్యాయంగా మమేకమై, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం, ఆప్యాయత చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జీవితాంతం కుటుంబానికి, సమాజానికి సేవ చేసిన వృద్ధులను ఆదరించడం మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. వృద్ధాశ్రమాల్లో ఉన్న వారికి అండగా నిలవడం,



వారి అవసరాలను తీర్చేందుకు దాతలు, సేవా సంస్థలు ముందుకు రావాలని కోరారు.

వృద్ధులకు చీరలు అందజేయడంతో పాటు అన్నదానం నిర్వహించడం పట్ల ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది మరియు పాల్గొన్నవారు సంతోషం వ్యక్తం చేశారు. సేవా భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం వృద్ధుల ముఖాల్లో ఆనందాన్ని నింపింది. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గ్రామీణ వైద్య సేవలకు నూతన ఉత్తేజం బి.వి.పురం, అక్కుర్తి గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు ప్రారంభం





**శ్రీకాళహస్తి రూరల్,పెన్ పవర్,అక్టోబర్ 06:**

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మరో ముందడుగు పడింది. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవ, ఆదేశాల మేరకు బి.వి.పురం, అక్కుర్తి గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను కలెక్టరేట్ ప్రాంగణం నుంచి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

గ్రామీణ ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ గ్రామంలోనే ప్రాథమిక వైద్య సేవలు పొందేలా ఈ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ముఖ్యంగా ప్రాథమిక చికిత్స, ఆరోగ్య పరీక్షలు, వైద్యుల సూచనలు వంటి సేవలు గ్రామస్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయి.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు కీలకంగా నిలుస్తాయని అన్నారు. ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, నాయకులు దొరై రాజిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చంద్ర, శివ సుదర్శన్ రెడ్డి, సతీష్, రాఘవరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

# టపాసుల దుకాణాలకు మౌలిక వసతుల కల్పనపై అధికారుల పరిశీలన



**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 06:**

గవర్నమెంట్ ఆసుపత్రికి వెళ్లే మార్గంలోని ఎస్‌వీఏ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో తాత్కాలిక టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో, దుకాణదారులు మౌలిక వసతులు కల్పించాలని ఆర్డీవోను కోరారు.

దుకాణదారుల విజ్ఞప్తి మేరకు ఆర్డీవో ఇచ్చిన ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బందితో కలిసి టపాసుల దుకాణాల కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. దుకాణాల ఏర్పాటుకు అవసరమైన పారిశుధ్యం, విద్యుత్, నీటి సదుపాయం, రహదారి తదితర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. టపాసుల దుకాణాల నిర్వహణ సమయంలో ప్రజలకు, దుకాణదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులు సూచించారు.

# గ్రామపంచాయతీ వారు పట్టించుకోవడం లేదు అమ్మ జిల్లా కలెక్టర్ మీరైనా స్పందించండి :-రాయమాలపురం గ్రామస్తులు

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 06**



రాయమాలపురం అభివృద్ధిలో భాగంగా ఊరి మొదటి నుండి ఊరు లోపలి వరకు కాలువలు సిమెంట్ రోడ్డు వేశారు కాల్వకు సిమెంటు రోడ్డుకు మధ్యలో కాల్వ వెంబడి పెద్ద గుంత మట్టితో పూడ్చకుండా అలాగే వదిలేశారు. రోడ్డు మధ్యలో డివైడర్ కోసం వదిలిన స్థలంలో గుంతలా ఉంది రాత్రి సమయంలో వాహనదారులు పొరపాటున ఏదైనా జరగరానిది జరిగితే ప్రాణాలు కోల్పోవాల్సిందే అలాంటి ప్రమాదాలు జరగకముందే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామపంచాయతీ వారిని సమస్య పరిష్కరించమని అడిగితే మాకు సంబంధం లేదు స్పెషల్ ఆఫీసర్లుకు ఫిర్యాదు చేయాలని చెప్పడం జరిగింది జిల్లా కలెక్టర్ మీరైనా స్పందించి కాల్వ వెంట గుంతను మట్టితో పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ముచ్చివోలులో జనసేన నాయకుల ఆత్మీయ భేటీ

## పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక ఎన్నికలపై కీలక చర్చ





**శ్రీకాళహస్తి రూరల్ ,పెన్ పవర్, అక్టోబర్ 06:**
ముచ్చివోలు గ్రామంలో జనసేన పార్టీ నాయకుల మధ్య ఆత్మీయ భేటీ జరిగింది. ఇటీవల మంగళగిరిలో జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన శ్రీ మిద్దెల హరి, శ్రీ సత్రవాడ ప్రవీణ్లను జనసేన సీనియర్ నాయకులు, శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు సభ్యులు దండి రాఘవయ్య, దండి నరేంద్ర ఆత్మీయంగా స్వాగతించారు.
ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాబోయే మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలు, అలాగే పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, వ్యూహాలపై నాయకులు చర్చించారు.
పార్టీలో ఐక్యతకు ప్రాధాన్యతనిస్తూ, గ్రూపులు, విభేదాలకు తావులేకుండా అందరూ ఒకే టీమ్‌గా సమన్వయంతో పనిచేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేస్తున్న పాత కేడర్‌కు గౌరవం, గుర్తింపు కల్పిస్తూనే, జనసేన సిద్ధాంతాలు మరియు శ్రీ పవన్ కళ్యాణ్ గారి ప్రజాసేవా దృక్పథంతో ఆకర్షితులై పార్టీలోకి వస్తున్న నూతన నాయకులు, కార్యకర్తలు, ప్రజలను సాదరంగా ఆహ్వానిస్తూ అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని నిర్ణయించారు.
పాత కేడర్ అనుభవం.. కొత్త నాయకత్వ ఉత్సాహం.. ప్రజల భాగస్వామ్యంతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడం, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో నిరంతరం స్పందించడం వంటి అంశాలపై కూడా చర్చించినట్లు తెలిపారు.
ఈ భేటీ ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించుకుని, రాబోయే రోజుల్లో జనసేన పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎగువవీధి హైస్కూల్ క్రీడాకారులు

## టేబుల్ టెన్నిస్, రగ్బీలో ప్రతిభ.. విద్యార్థులకు అభినందనలు

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 06:**
పట్టణంలోని ఎగువవీధి ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడా రంగంలో సత్తా చాటుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, పట్టణానికి గర్వకారణంగా నిలిచారు.
ఈ నెల 3న పాఠశాల ఆవరణలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్19 బాలుర విభాగంలో పవన్‌కుమార్, అండర్14 బాలికల విభాగంలో చెంచులక్ష్మి, జస్మిత మహేశ్వరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా రగ్బీ అండర్17 బాలుర విభాగంలో పదో తరగతి విద్యార్థి చరణ్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.
టేబుల్ టెన్నిస్‌లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9న గుంటూరు జిల్లా భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. రగ్బీ విభాగంలో ఎంపికైన చరణ్ ఈ నెల 10 నుంచి కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో




పాల్గొంటారు. విద్యార్థులకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కిషోర్ ప్రత్యేక శిక్షణ అందించారు. రాష్ట్రస్థాయిపోటీలకుఎంపికైనవిద్యార్థులనుప్రధానోపాధ్యాయుడుసురేష్,ఉపాధ్యాయులుఅభినందించారు.రాష్ట్రస్థాయి లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూవారికినిరంతరంశిక్షణ,మార్గదర్శకత్వంఅందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# ఎన్నికల అభ్యర్థులకు కుల, నోడ్యూస్ సర్టిఫికేట్లు

## తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ.



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 06**
నంద్యాల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన వైఎస్సార్సీపీ నేతలు
రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కుల మరియు నోడ్యూస్ సర్టిఫికేట్లను ఎటువంటి జాప్యం, అంతరాయం లేకుండా తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు మరియు మరియు మాజీ మార్కెట్ చైర్మన్, పీపీ నాగిరెడ్డి, ఎస్ఈ సి సభ్యుడు కల్లూరి రామలింగారెడ్డి పార్లమెంట్ కార్యదర్శి మరియు నంద్యాల అసెంబ్లీ పరిశీలకులు సద్దల సూర్యనారాయణ రెడ్డి, శ్రీశైల నియోజవర్గ సీనియర్ నాయకులు, శిల్పా భువనేశ్వరరెడ్డి, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూర్ సుమంత్ రెడ్డి, జిల్లా ట్రెజరర్ మధు మోహన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఇప్పల నారాయణరెడ్డి తదితర ప్రముఖ వైఎస్సార్సీపీ నేతలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మరియు ఎమ్మెల్సీ ఇసాక్ బాష మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు, నోడ్యూస్ సర్టిఫికేట్లు అత్యంత కీలకమని తెలిపారు. అయితే, ఇటీవల సర్టిఫికేట్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెళ్లిన వారికి 'సర్వర్ డౌన్' పేరుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా వేగంగా సర్టిఫికేట్లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు వెల్లడించారు.

# ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

- కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి.. సీఐటీయూ డిమాండ్

**శ్రీకాళహస్తి,పెన్ పవర్, అక్టోబర్ 06:**
ఏళ్ల తరబడి ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మను కలిసి ఆశా కార్యకర్తల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించాలని, అన్ని రకాల సెలవులు మంజూరు చేయడంతో పాటు ప్రసూతి సెలవులు, ఇతర సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీర్ఘకాలంగా ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.
అర్హత, శిక్షణ కలిగిన ఆశా కార్యకర్తలకు ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అవకాశం కల్పించాలని, పదవీ విరమణ సమయంలో ఆర్థిక ప్రయోజనాలు అందించాలని



డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన ఆశా కార్యకర్తల కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని కోరారు.
అలాగే ఆశా కార్యకర్తలపై ఉన్న అదనపు పనిభారాన్ని తగ్గించాలని, విధి నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రక్షణ పరికరాలను ప్రభుత్వం అందించాలని కోరారు. ఆశాల న్యాయమైన డిమాండ్లను ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని బృందమ్మను కోరారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంధం మణి, నాగరాజు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్యకర్తలకు రూ.5 లక్షలు సాయం

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ
- ఎన్నికలలో కలసి కట్టుగా పని చేయాలి

**పెన్ పవర్ రొంపిచర్ల మండలం అక్టోబర్6**
ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్యకర్తలకు వైఎస్సార్సీపీ పార్టీ రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తుందని వైఎస్సార్సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లోని వైఎస్సార్సీపీ కార్యకర్తలకు ఐడీ కార్డులు మంగళవారం ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేయాలన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికలంటే భయ పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికలలో ఓడి పోతామని పోలీసుల సాయంతో వైఎస్సార్సీపీ వారిని బెదిరించి ఎన్నికల్లో గెలవాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు.రాయలసీమకరువుతో అల్లాడుతుందన్నారు . పోతిరెడ్డిడు ప్రాజెక్టు పనులను మారి కాకుండా చూపామి తెలంగాణ సీఎం రేవంత్రెడ్డికి సీఎం



చంద్రబాబు హామీ ఇచ్చారని చెప్పుతున్నారని అన్నారు. వైఎస్సార్సీపీలో కష్ట పడే వారికి పదవులు ఇచ్చామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతులకు నెలకు రూ. 1500, నిరుద్యోగులకు నెలకు రూ. 3000నిరుద్యోగభృతి హామీలు ఇచ్చిందన్నారు. అయితే ఇప్పుడు 18 సంవత్సరాలునిండిన యువతులకు రూ. 3000 ఇవ్వలంటే ఏపీని అమ్మేసిన ఇవ్వలేమని రాష్ట్ర మంత్రులు చెప్పుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో అమలు చేయలేని హామీ ఇచ్చి నేడు వాటిని అమలు చేయకుండా చేతులు పైకి ఎత్తి వేశారని తెలిపారు. సీఎం చంద్రబాబు అధికారంలోకి వస్తే తీవ్ర కరువు వస్తుందన్నారు. కరువుతో ప్రజలు అల్లాడుతుంటే



ఆదుకోవాల్సిన ప్రభుత్వం కన్నెత్తి చూడడం లేదన్నారు. కూటమి పాలనతో ప్రజలు విసిగి పోయారని అన్నారు. ఎన్నికలు సజావుగా జరిగితే 90 శాతం స్థానాలను వైఎస్సార్సీపీ గెలుచుకొంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, సురేంద్రరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు చెంచురెడ్డి, కోటా వెంకటరమణ, నాథముని రెడ్డి, రెడ్డిశ్వర్ రెడ్డి, పోకల ఆశోకుమార్, డి.హరినాథరెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, కరీముల్లా, విజయశేఖర్, రవీంద్ర, ఉమాపతి రెడ్డి, ప్రశాంత్ రెడ్డి యశ్వంత్ రెడ్డి , రెడ్డిశేఖర్ రెడ్డి, బావాజీ, సైపూలాఖాన్, ఓబులేసు, మహబుబ్ బాషా, అల్లాబక్స్, తదితరులు పాల్గొన్నారు

# ఫైవ్ స్టార్‌లో ఇదేం దందా గురూ..?

- లోన్లు కట్టినా డాక్యుమెంట్ల కోసం అదనపు డబ్బులా..?
- ఈఎంఐ లు చెల్లించినా ఖాతాల్లో జమ కావడం లేదంటున్న బాధితులు
- శ్రీకాళహస్తిలో మూడు బ్రాంచులపై ఫిర్యాదులు.. ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 06:**
నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాల్సిన ప్రముఖ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ లి'ఫైవ్ స్టార్'లికు చెందిన శ్రీకాళహస్తి పట్టణంలోని మూడు బ్రాంచులపై పలువురు కస్టమర్లు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రుణాలు తీసుకుని నెలనెలా ఈఎంఐలు చెల్లిస్తున్నప్పటికీ, తమను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.
లోన్ పూర్తిగా చెల్లించిన తర్వాత కూడా ఒరిజినల్ డాక్యుమెంట్లు, ఎన్ఓసీ, లోన్ క్లోజర్ పత్రాలు ఇవ్వడానికి అదనంగా డబ్బులు అడుగుతున్నారని కొందరు కస్టమర్లు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఈఎంఐ లు కట్టించుకుంటారు.. ఖాతాల్లో జమ చేయరా?**
బాధితులు చేస్తున్న మరో కీలక ఆరోపణ కలకలం రేపుతోంది. ఏజెంట్లకు నగదు రూపంలో ఈఎంఐలు చెల్లించినప్పటికీ, ఆ మొత్తాలు తమ రుణ ఖాతాల్లో సక్రమంగా జమ కావడం లేదని వారు చెబుతున్నారు. తరచూ ఏజెంట్లను మార్చడం వల్ల గతంలో చెల్లించిన నగదుకు లెక్కలు తేలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత ఏజెంట్‌కు చెల్లించిన మొత్తంపై ప్రశ్నిస్తే, కొత్త ఏజెంట్ తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.
చెల్లించిన మొత్తాలకు రశీదులు ఇవ్వాలని, ఖాతా స్టేట్‌మెంట్ చూపించాలని కోరితే కొందరు సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**చెల్లించిన ఈఎంఐ లే బకాయిలుగా చూపుతున్నారా?**
తాము సక్రమంగా ఈఎంఐలు చెల్లించినప్పటికీ, వాటిని బకాయిలుగా చూపిస్తూ అదనపు వడ్డీలు, ఇతర ఛార్జీలు విధిస్తున్నారని కొందరు బాధితులు ఆరోపిస్తున్నారు. బకాయిలు చెల్లించకపోతే ఇళ్లకు తాళాలు వేస్తామంటూ ఒత్తిడి చేస్తున్నారని వాపోతున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెబుతున్నారు.

**అనిల్, దశరథ్‌లపై కస్టమర్ల ఆరోపణలు**
ఫైనాన్స్‌సంస్థకార్యకలాపాల్లోకీలకంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్న అనిల్, దశరథ్‌లపై పలువురు కస్టమర్లు ఆరోపణలు చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ వెలువడాల్సి ఉంది.

**బాధితుల ఆవేదనపై ఉన్నతాధికారులు స్పందించాలి**
రుణ సమస్యలతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను మరింత ఒత్తిడికి గురిచేయకుండా, కస్టమర్ల నుంచి వసూలైన ప్రతి రూపాయికి పారదర్శక లెక్కలు చూపించాలని బాధితులు కోరుతున్నారు. లోన్ క్లోజర్ అనంతరం డాక్యుమెంట్ల జారీ, ఎన్ఓసీ, ఈఎంఐల జమ, వడ్డీ లెక్కలు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.
తమ సమస్యలు పరిష్కారం కాకపోతే తీవ్ర నిర్ణయాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందంటూ కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.
శ్రీకాళహస్తిలోని మూడు ఫైవ్ స్టార్ బ్రాంచులపై వస్తున్న ఆరోపణలపై సంస్థ ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని, అవసరమైతే సంబంధిత నియంత్రణ సంస్థలు విచారణ చేపట్టి నిజానిజాలు తేల్చాలని బాధితులు కోరుతున్నారు.

# కొడవలూరు మండలానికి పల్లె పండుగ 3.0లో రూ.2.06 కోట్ల పనులు

- మిగిలిన రోడ్లు, డ్రెయిన్లన్నీ పూర్తి చేస్తాం.. గ్రామాల అవసరాలే ప్రాధాన్యంగా అభివృద్ధి: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- కోవూరు నియోజకవర్గంలో 217 పనులకు సుమారు రూ.10 కోట్లు కొడవలూరులో 56 పనులు
- పల్లె పండుగ 1.0, 2.0లో కొడవలూరు మండలానికి సుమారు రూ.1.18 కోట్ల పనులు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.11 వేల కోట్లకు పైగా చొప్పున నిధులు జలజీవన్‌కు రూ.30 వేల కోట్లు
- కిసాన్ సెజ్‌తో స్థానిక యువతకు ఉపాధి చక్కెర కర్మాగారం సమస్య పరిష్కారానికి చర్యలు
- స్థానిక ఎన్నికల్లో 24 పంచాయతీలతో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల్లో కూటమి విజయమే లక్ష్యం

**నెల్లూరు అక్టోబర్ 6 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో ప్రజలకు ఎక్కడ ఏ అవసరం ఉందో గుర్తించి దశలవారీగా పనులు చేపడుతోందని కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. పల్లె పండుగ 1.0, 2.0లో కొడవలూరు మండలంలో సుమారు రూ. 1.18 కోట్ల పనులు చేపట్టామని, ఇప్పుడు పల్లె పండుగ 3.0లో మరో రూ. 2.06 కోట్ల పనులు మంజూరయ్యాయని వెల్లడించారు. మంగళవారం కొడవలూరు మండలం తాటాకులదిన్నెలోని ఎస్సీ కాలనీలో రూ. 10 లక్షలతో చేపట్టనున్న రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

**ప్రతి గ్రామ అవసరానికీ ప్రాధాన్యం**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. గత రెండేళ్లుగా ప్రజల అవసరాలను తెలుసుకుని రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నామని, పల్లె పండుగ మూడు దశల్లోనూ కొడవలూరు మండలానికి ప్రాధాన్యం ఇచ్చామని పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గంలో పల్లె పండుగ 3.0 కింద మొత్తం 217 పనులకు సుమారు రూ. 10 కోట్లు కేటాయించామని, ఇందులో కోవూరు మండలంలో 32, ఇందుకూరుపేటలో 36, కొడవలూరులో 56, విడవలూరులో 46, బుచ్చిరెడ్డిపాలెంలో 47 పనులు చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వానికి ఇంకా రెండున్నర సంవత్సరాల సమయం ఉందని, ఈ కాలంలో మిగిలిపోయిన రోడ్లు, డ్రెయిన్లను గుర్తించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**పనుల్లో నాణ్యత విషయంలో రాజీ లేదు**
మంజూరైన పనులను ఆయా గ్రామాలకు చెందిన





నాయకులు, బాధ్యతలు తీసుకున్న వారు తమ సొంత గ్రామ పనులుగా భావించాలని ఎమ్మెల్యే సూచించారు. 'ఇది మన ఊరు.. ఇది మన పని' అనే బాధ్యతతో వ్యవహరిస్తూ రహదారులు, డ్రెయిన్లు తదితర పనులను అత్యంత నాణ్యతతో పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. గ్రామస్తులు కూడా పనుల నాణ్యతను పర్యవేక్షించాలని కోరారు.

**సంక్షేమం.. అభివృద్ధి రెండు సమపాళ్లలో**
రాష్ట్ర పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్న సమయంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పరిస్థితులను చక్కదిద్దుకుంటూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకవైపు సంక్షేమాన్ని, మరోవైపు అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నారని అన్నారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్రవ్యాప్తంగా రూ. 11 వేల కోట్లకు పైగా, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరో రూ. 11 వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేశామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వివరించారు.

**ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు**
జలజీవన్ మిషన్ కోసం తాజాగా రూ. 30 వేల కోట్లు విడుదల కావడంతో గ్రామాల్లో తాగునీటి పనులు మరింత వేగవంతం కానున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. ఎక్కడ నీటి సమస్య ఉన్నా గుర్తించి పైపులైన్ల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని, రాబోయే రోజుల్లో నీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని హామీ ఇచ్చారు.

**కిసాన్ సెజ్‌తో యువతకు స్థానికంగానే ఉపాధి**
కొడవలూరు మండలంలోని కిసాన్ సెజ్‌లో ఇప్పటికే పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పరిశ్రమలు వస్తాయని, స్థానిక యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటికి సమీపంలోనే ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. విద్యా రంగంలోనూ ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తోందని, విద్యార్థులకు మెరుగైన విద్య, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి



సదుపాయాలతో పాటు పాఠశాలల్లో బోధనా ప్రమాణాలను పెంచేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

**చక్కెర కర్మాగార సమస్యకు పరిష్కారం**
కొడవలూరు మండలంలోని చక్కెర కర్మాగారానికి సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. కర్మాగార బకాయిలను త్వరలో చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, శిథిలావస్థలో ఉన్న కర్మాగారం స్థానంలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**24 పంచాయతీల్లో కూటమి జెండా ఎగరాలి**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొడవలూరు మండలంలోని 24 పంచాయతీలతో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి కానుకగా ఇవ్వాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఎవరు అభ్యర్థులుగా నిలబడినా గ్రామంలో ప్రతి కుటుంబం, ప్రతి మహిళ, ప్రతి యువత గత రెండేళ్లలో జరిగిన పనులను, ప్రభుత్వ పనితీరును ఒకసారి బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవాలని కోరారు. పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, యువతకు ఉపాధి కోసం నిరంతరం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు.

# కూటమి సర్కారు ఎఫెక్ట్: ఈసారి 'దసరా' అదరహో..!



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 20 వరకు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. అయితే.. ఏటా జరిగేదే కదా..అని అనుకోవచ్చు. కానీ, కూటమి ప్రభుత్వం ఈ ఉత్సవాలకు ప్రత్యేక హంగులు అద్ది.. అదరహో అని అనిపించేలా చేస్తోంది. సాంకేతికతను వినియోగించి.. భక్తులకు మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ విశేషాలు చూస్తే.. నిజనంగానే దసరా అదరహో..అనేలా సాగనుందనడంలో సందేహం లేదు.

**తొలిసారి ఆన్‌లైన్‌లో..**

శరన్నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రి భక్తుల కోసం ప్రత్యక్ష విశేష ఆర్జిత సేవల ఆన్‌లైన్ టికెట్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆన్‌లైన్ విధానంలో విశేష సేవల టికెట్లను భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో నిర్వహించే పవిత్ర విశేష సేవల్లో భక్తులు ప్రత్యక్షంగా పాల్గొనేందుకు ఈ ఆన్‌లైన్ టికెట్లు వీలు కల్పిస్తాయి. ప్రత్యక్షంగా ఆయా సేవలను.. ఇంట్లో కూర్చునే వీక్షించడంతోపాటు పాల్గొనవచ్చు కూడా.

**పోస్టల్ సేవలు..**

దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మవారి దసరా ప్రసాదాన్ని భక్తుల ఇంటివద్దకే చేర్చేందుకు తపాలా శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దసరా ఉత్సవాలకు నేరుగా రాలేని భక్తుల కోసం ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఒక ప్రసాదం కిట్ ధరను 116 రూపాయలుగా నిర్ణయించారు. భక్తులు తమ సమీపంలోని ఏదైనా ప్రధాన పోస్ట్ ఆఫీస్ కి వెళ్లి కనకదుర్గమ్మ ప్రసాదం కిట్‌ను బుక్ చేసుకోవచ్చు. ఈ ప్రత్యేక ప్రసాదం కిట్‌లో లడ్డు ప్రసాదంతో పాటు శక్తి కంకణం, అమ్మవారి కుంకుమ, అక్షతలు ఉంటాయి. ఇది కూడా ఈ ఏడాది నుంచే ప్రారంభించారు.

**రారండో రండి!**

కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 11 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. అలాగే, –విజయవాడ ఉత్సవ్ 2.0– పేరుతో ప్రత్యేక కార్యక్రమం కూడా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పలువురు కేంద్ర మంత్రులు ఆయా ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ.. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అమలాపురం పార్లమెంటు సభ్యులు హరీష్ బాలయోగి తదితరులు.. ఆహ్వాన పత్రికలు అందించారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ప్రహ్లాద్ జోషీలను మంగళవారం ఢిల్లీలో కలుసుకుని వారికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. తప్పకుండా ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని కేంద్ర మంత్రులను కోరారు.

**లడ్డూ ఏటీఎం..**

దుర్గమ్మ ప్రసాదం కోసం క్యూలైన్‌లో నిలబడకుండా.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లడ్డూ ఏటీఎం కూడా శరన్నవరాత్రుల్లోనే భక్తులకు అందుబాటులోకి వచ్చింది. మనకు ఎన్ని బాక్సులు(ఒక్కొక్క బాక్సులో 6 లడ్డూలు ఉంటాయి) కావాలని అనుకుంటే.. ఒక్కొక్క దానికి 100 చొప్పున చెల్లించి.. ఈ ఏటీఎం నుంచి తీసుకోవచ్చు. ఫోన్ పే, గూగుల్ పేలతో స్కాన్ చేయడం ద్వారా ఈ సౌకర్యాన్ని భక్తులు వినియోగించుకునే అవకాశం ఉంది.

# ఢిల్లీ వేదికగా బీసీ మంత్రుల కసరత్తు.. రిజర్వేషన్ల కోసం ఆఖరి పోరాటం



**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం గట్టిపోరాటం చేస్తున్నట్లు ప్రభుత్వం సంకేతాలు పంపుతోంది. ఇప్పటికే ఈ విషయంలో హైకోర్టులో ఎదురుదెబ్బ తిన్న కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టులో గట్టి వాదనలు వినిపించి బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుమతి తెచ్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఏవిధమైన వాదనలు వినిపించాలనే అంశంపై ఢిల్లీ వేదికగా భారీ కసరత్తు చేస్తోందని చెబుతున్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో సుప్రీం గత తీర్పులు కూటమి సర్కారును ఆందోళనకు గురిచేస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఏపీ ప్రభుత్వం పెంచిన బీసీ రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంలో గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ ప్రభుత్వానికి ఇదే అనుభవం ఎదురైందని చెబుతున్నారు. దీంతో కూటమి సర్కారు న్యాయనిపుణలతో సంప్రదింపులు మొదలుపెట్టిందని ప్రచారం జరుగుతోంది. రిజర్వేషన్ల పరిమితి లక్ష్మణరేఖ ఏం కాదని, అవసరమైన సందర్భాల్లో పెంచడంలో తప్పులేదని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు నివేదించడం ఎలా అన్న విషయమై విస్తృత సంప్రదింపులు జరుపుతోందని అంటున్నారు. ప్రధానంగా 34 శాతం బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా సుప్రీం తీర్పు కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్న ప్రభుత్వం ఆ బాధ్యతలను బీసీ నేతలకు అప్పగించిందని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో బీసీ సామాజికవర్గానికి చెందిన మంత్రులు ఢిల్లీలో మకాం వేశారు. కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహననాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి తదితరులు ఢిల్లీలో న్యాయనిపుణులతో వరుసగా సమావేశమవుతూ సుప్రీంకోర్టులో వినిపించాల్సిన వాదనలపై మార్గనిర్దేశం చేస్తున్నారని అంటున్నారు. గత శనివారం హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం అప్పీలు చేయగా, ఈ వారంలో విచారణకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

**రాజకీయ వ్యూహం**

సుప్రీం విచారణలో ఏ విధమైన వాదనలు వినిపించాలనే అంశంతోపాటు పెంచిన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరిగేలా ఆదేశాలు పొందడం బీసీ మంత్రుల లక్ష్యంగా పెట్టుకున్నారని చెబుతున్నారు. అయితే ప్రభుత్వ వాదనతో సుప్రీం ఏకీభవించని పక్షంలో రాజకీయంగా నష్టం లేకుండా ఏ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలనే అంశాన్ని కూటమి నేతలు ముందుగానే సిద్ధం చేసుకుంటున్నట్లు కనిపిస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం తాము చిత్తశుద్ధిగా పనిచేశామని, ఇందుకు బీసీ నేతలే సాక్ష్యమని ప్రచారం చేసుకోవడంలో భాగంగా సీనియర్ మంత్రులను ఢిల్లీకి పంపినట్లుగా భావిస్తున్నారు. మొత్తానికి బీసీ రిజర్వేషన్లపై చివరి వరకు పోరాడాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తోందని చాటిచెప్పేలా పక్కా ప్లాన్ తో ప్రభుత్వం అడుగులు వేస్తోందని అంటున్నారు.

# వైసీపీలో జలధార వణుకు..

**కడప, అక్టోబరు 6, పెన్ పవర్:**

కడప జిల్లా ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగుపెట్టి అమరజీవి జలధార పథకానికి శ్రీకారం చుట్టడం చూసి తాడేపల్లి సహా స్థానిక వైసీపీ నేతలకు గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. పల్లెల్లోని ప్రతి గడపకూ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి దాహం తీర్చే బృహత్తర కార్యక్రమం తమ ఇలాకాలో మొదలవుతుంటే.. అయ్యో, వీళ్లు ఇంత మంచి పని చేస్తే ఇక కడప గడ్డపై మా ఉనికేం కావాలి.. మా ప్యాలెస్ పలుకుబడి ఏమైపోవాలి అన్న భయం వైసీపీ నేతలను నిలువునా దహించివేస్తోంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక, ప్రజల్లో తమ పరపతి ఎక్కడ గల్లంతవుతుందోనన్న బెంగతో చిత్రవిచిత్ర విన్యాసాలకు తెరలేపారు.

తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రాయలసీమకు చేసిందేమీ లేకపోయినా.. ఇప్పుడు కూటమి సర్కార్ రాయలసీమ రైజింగ్ కింద సుమారు లక్ష కోట్ల భారీ ప్రణాళికతో హార్టికల్చర్ హబ్, ప్రాజెక్టుల అభివృద్ధికి శ్రీకారం చుడుతుంటే వైసీపీ తట్టుకోలేకపోతోంది. ప్రభుత్వం ఒక విజన్‌తో అడుగులు వేస్తుంటే, దాన్ని డైవర్ట్ చేసేందుకు తమదైన ఫేక్ ఫ్యాక్టరీకి పనిచెప్పారు. ప్రొద్దుటూరు పరిసరాల్లో అర్ధరాత్రి వేళ దొంగచాటుగా వెళ్లి.. పంటలు ఎండిపోతున్నాయి.. రూ. లక్ష కోట్లు ఎక్కడ అంటూ వింత పోస్టర్లు పొలాల్లో పెట్టారు. ఆ వీడియోలు తీసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఇందులో అసలైన కామెడీ ఏమిటంటే.. ఆ పోస్టర్లు వేసింది తామేనని చెప్పుకునే కనీస దమ్ము, ధైర్యం కూడా వైసీపీ నేతలకు లేకపోవడమే!పోస్టర్ల కింద దర్జాగా పార్టీ పేరు గానీ, పార్టీ గుర్తు గానీ పెట్టుకోలేక.. రాయలసీమ రైతులు అనే ముసుగు తగిలించుకుని దొంగచాటు రాజకీయం నడుపుతున్నారు. ఆ పోస్టర్లు వేయించింది ఎవరో, ఆ స్క్రిప్ట్ ఎవరిదో పసిగట్టడానికి ప్రజలకు పెద్దగా పరిశోధనలేమీ అక్కర్లేదు. రాజకీయాల్లో విమర్శలు చేయాలంటే గుండెల నిండా ధైర్యం ఉండాలి, కానీ ఇలా రైతుల పేరుతో తెరవెనుక దాక్కుని దొంగ పోస్టర్లు అంటించడం వైసీపీ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం. ప్రజల ముందుకు వచ్చి మాట్లాడే మొహం లేక, ఇలా ట్యాగ్‌లైన్ల వెనుక దాక్కోవడం కడప రాజకీయ చరిత్రలోనే ఒక వింత రికార్డు అనే సెటైర్లు వినిపిస్తున్నాయి.జగన్ రెడ్డి అధికారంలో ఉన్నన్నాళ్లూ కడప జిల్లా రైతులే కాదు, చివరకు పులివెందుల రైతులు కూడా సాగునీరు, తాగునీరు అందక నానా ఇబ్బందులు పడ్డారు. ఆ ఐదేళ్లూ నోరు మెదపని నాయకులు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సీమను సస్యశ్యామలం చేసేందుకు నిధులు సమకూరుస్తుంటే ఓర్వలేకపోతున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిల్లాకు చేసిందేమీ లేకపోయినా, ఇప్పుడు ఇంటింటికీ కుళాయి నీరు, రైతులకు ఉద్యానవన ప్రాజెక్టులు వస్తుంటే మాత్రం పోస్టర్లు వేసి సంతృప్తి పడుతున్నారు.

**గ్రామాల్లో ఫ్యాన్ ఖాళీ**

2024 ఎన్నికల సమయం లో తాడేపల్లిగూడెం లో నిర్వహించిన కూటమి సభ కూటమి పార్టీల అభిమానులకు ఒక మధుర జ్ఞాపకం అని చెప్పొచ్చు. పవన్ కళ్యాణ్ ఎంతో ఆవేశంతో వైసీపీ పార్టీ ని పాతాళంలోకి తొక్కకపోతే నా పేరు పవన్ కళ్యాణ్ కాదు , నా పార్టీ జనసేన కాదు అని పెద్ద సవాల్ విసరడం వంటివి మనం అంత తేలికగా మనం మర్చిపోగలమా చెప్పండి. అప్పట్లో ఈ సవాల్ ని వైసీపీ వాళ్ళు చాలా కామెడీ గా తీసుకున్నారు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత వాళ్లకు మబ్బులు వీడిపోయాయి. పవన్ కళ్యాణ్ చెప్పిందే చేసాడు కదా అని అప్పుడు బాధపడ్డారు. అయితే అది కేవలం టీజర్ మాత్రమే.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామాల్లో వైసీపీ ని ఖాళీ చేసే వ్యూహాన్ని రచించాడు పవన్ కళ్యాణ్. ఇప్పటికే గ్రామాల్లో వేల సంఖ్యలో వైసీపీ క్యాడర్ జనసేన పార్టీ కి షిఫ్ట్ అవుతూ వస్తోంది. గ్రామీణ ఎన్నికలు మొదలయ్యేలోపు వైసీపీ క్యాడర్ మొత్తాన్ని జనసేన కి షిఫ్ట్ అయ్యేలా మాస్టర్ ప్లాన్ వేసాడు పవన్ కళ్యాణ్. ఇదే కనుక జరిగితే జగన్ కి చావుదెబ్బ నే అని చెప్పొచ్చు. మాజీ సీఎం జగన్ తాను గతం లో చేసిన తప్పులు , పొరపాట్లను సరిదిద్దుకొని , ముందుకు వెళ్తే ఈరోజు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. తాను ఇప్పటికీ అద్భుతమైన పాలన ని అందించానని , దొంగ ఈవీఎం లు వాడి కూటమి పార్టీలు అధికారం లోకి వచ్చాయనే ఊహల్లోనే జగన్ మరియు ఆయన అనుచరులు ఉన్నారు. ఇలాంటి ఊహల్లో ఉన్నంత కాలం టీడీపీ , జనసేన పార్టీ లకు తిరుగు ఉండదు అనే చెప్పాలి.విజయనగరం జిల్లాలో వైసీపీ పార్టీ పరిస్థితి ఎలా తయారైందో చూస్తూనే ఉన్నాం. మన కళ్ల ముందే ఆ పార్టీ కుప్పకూలిపోయింది. వైసీపీ క్యాడర్ మొత్తం ఇప్పుడు టీడీపీ సొంతమైంది. అతి త్వరలోనే బొత్స సత్యనారాయణ జనసేన పార్టీ లో చేరే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. అదే కనుక జరిగితే విజయనగరం జిల్లాలో వైసీపీ పార్టీ పునాదులతో సహా కొట్టుకుపోయినట్టే అని చెప్పొచ్చు. ఇదే తరహా ఆపరేషన్ ని టీడీపీ , జనసేన అన్ని జిల్లాల్లోనూ చేస్తోంది. ముఖ్యంగా జనసేన పార్టీ లో స్పేస్ ఎక్కువ ఉండడం తో వైసీపీ బడా లీడర్లు చేరుతున్నారు. అనుకున్నది అనుకున్నట్టు చేస్తే వచ్చే ఏడాది లో పాదయాత్ర చేస్తానన్న జగన్ కి చుక్కలు కనిపిస్తాయి. ఎందుకంటే అత్యధిక శాతం వైసీపీ క్యాడర్ టీడీపీ , జనసేన పార్టీల్లో ఉంటాయి , పాదయాత్ర కి కావాల్సినంత డబ్బు పెట్టే నాయకులు కూడా ఉండరు. చూడాలి మరి ఏమి జరగబోతుంది అనేది.

# వ్యూహాలు సరే... ఆచరణ సాధ్యమేనా

**గుంటూరు, అక్టోబరు 6, పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రాధాన్యత కలిగిన సవాలుగా మారాయి. 2024 సాధారణ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని తుడిచిపెట్టేందుకు అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చావో రేవో తేల్చుకోవడానికే సిద్ధమయ్యారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జిల్లాల వారీగా రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో సుదీర్ఘ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, స్థానిక ఎన్నికలను లైట్ తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అధికార పక్షం నుంచి ఎలాంటి ఎదురుదెబ్బలు తగిలినా, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ప్రతీ స్థానంలో అభ్యర్థులను నిలబెట్టి పోటీని రసవత్తరంగా మార్చడమే జగన్ ప్రాథమిక వ్యూహంగా కనిపిస్తోంది.ఈసారి స్థానిక సమరంలో వైఎస్సార్‌సీపీ వ్యూహం మునుపటి కంటే చాలా భిన్నంగా ఉంది. ప్రతీ స్థానానికి సంబంధించి ప్రతిపాదించిన అభ్యర్థుల బలాబలాలను జగన్ స్వయంగా వడపోస్తున్నారు. అభ్యర్థి పార్టీకి ఎంత విధేయుడు? కేసులకు భయపడకుండా నిలబడగలడా? గెలిచాక పార్టీ మారకుండా ఉంటాడా? అనే అంశాల ఆధారంగానే బి-ఫామ్‌లు ఖరారు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ఇన్చార్జ్‌లు సరిగా పనిచేయకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ, అధిష్టానం వద్ద ఉన్న సమాచారంతో జిల్లాల నివేదికలను సరిపోల్చుకుంటున్నారు. ఓడినా గెలిచినా బరిలో నిలవడం ద్వారా మాత్రమే పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపవచ్చని జగన్ బలంగా నమ్ముతున్నారు.ఇదే సమయంలో, అధికార తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిలోని అంతర్గత విభేదాలను క్యాష్ చేసుకోవడానికి వైఎస్సార్‌సీపీ పావులు కదుపుతోంది. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల స్థానాలకు నేరుగా ఎన్నికలు జరుగుతుండటంతో ఆశావహుల పోటీ కూటమిలో పీక్స్‌కు చేరింది. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి ప్రధాన కార్పొరేషన్లలో మేయర్ సీటు కోసం టీడీపీలోని బలమైన వర్గాలు, జనసేన నేతల మధ్య టికెట్ల పోరు తీవ్రమవుతోంది. కూటమిలో కిందిస్థాయి నాయకుల మధ్య సమన్వయం కుదరడం అంత తేలిక కాదన్న విషయాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ, అక్కడ ముదిరే విభేదాలను తమకు అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తోంది.ఈ మైండ్ గేమ్‌లో భాగముగానే వైఎస్సార్‌సీపీ తమ మేయర్, చైర్మన్ అభ్యర్థుల పేర్లను ముందే ప్రకటించకుండా గుంభనంగా వ్యవహరిస్తోంది. కూటమిలో టికెట్ దక్కని అసంతృప్త నేతలు, లేదా భాగస్వామ్య పక్షాల మధ్య కుదరని పొత్తుల వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను గమనించిన తర్వాతే తమ అభ్యర్థులను ఖరారు చేయాలనేది జగన్ ఆలోచన. అంతేకాకుండా, ముందుగానే తమ అభ్యర్థుల పేర్లు బయటపెడితే అధికార యంత్రాంగం ద్వారా వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొడతారనే వ్యూహాత్మక భయం కూడా వైఎస్సార్‌సీపీని ముందస్తు ప్రకటనలు చేయకుండా అడ్డుకుంటోంది. సోషల్ మీడియాలోనూ కూటమి వైఫల్యాలను, కిందిస్థాయి నేతల ఘర్షణలను హైలైట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ డిజిటల్ వింగ్ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. పోటీ నుంచి తప్పుకుంటే పార్టీ ఆనవాళ్లు కోల్పోతాం అన్న సంకేతాన్ని జగన్ బలంగా పంపడంతో, క్షేత్రస్థాయి నాయకులు కూడా ఈ ఎన్నికలను తమ ఉనికికి పరీక్షగా భావించి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కూటమి కట్టడిని దాటుకుని స్థానిక సంస్థల్లో సత్తా చాటడం వైఎస్సార్‌సీపీకి అంత సులువైన విషయం కాదు. అయినప్పటికీ, ప్రత్యక్ష ఎన్నికల్లో కూటమి నేతల విభేదాలను ఆసరాగా చేసుకుని లబ్ధి పొందాలనే జగన్ పక్కా లీగల్ ఀ పొలిటికల్ మైండ్ గేమ్ ఏ మేర ఫలిస్తుందో రాబోయే స్థానిక ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

# కొత్తగా పెన్షన్లకు 14 లక్షల దరఖాస్తులు

## ఆరంచెల తనిఖీ, డిజిటల్ ఫిల్టరేషన్

**విజయవాడ, అక్టోబరు 6, పెన్ పవర్:** ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పెంపుతో పాటు కొత్త పింఛన్ల మంజూరు అంశం అధికార కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ప్రభుత్వం కొత్త దరఖాస్తులను ఆహ్వానించడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13.65 లక్షల కంటే ఎక్కువ అప్లికేషన్లు వచ్చి పడ్డాయి. నెలకు ప్రాథమిక పింఛను మొత్తాన్నే రూ. 4,000కు పెంచడంతో, ప్రభుత్వ ఖజానాపై ఇప్పటికే ప్రతినెలా రూ. 2,700 కోట్లకు పైగా భారం పడుతోంది. ఈ నేపథ్యంలో దాదాపు 14 లక్షలకు పైగా వచ్చిన కొత్త దరఖాస్తులన్నింటికీ ఆమోదం తెలిపి పింఛన్లు ఇవ్వడం అనేది నిధుల కొరతతో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఏమాత్రం సాధ్యంకాని పని.మరోవైపు, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హులకు భారీగా పింఛన్లు ఇచ్చారనే విమర్శలు ఉన్నప్పటికీ, వాటిని తొలగిస్తే రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత వస్తుందనే భయం ప్రభుత్వంలో కనిపిస్తోంది. లక్షలాది మంది పాత లబ్ధిదారుల పింఛన్లను ఒకేసారి రద్దు చేస్తే, లబ్ధిదారులు వీధిలోకి రావడం, ప్రతిపక్షాలు దానిని ప్రధాన రాజకీయ అస్త్రంగా మార్చుకోవడం ఖాయం. అందువల్ల పాత లబ్ధిదారుల విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం వెనుకంజ వేస్తోంది. ఫలితంగా అనర్హుల పింఛన్లు కొనసాగుతుండటం క్షేత్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.ఈ పరిస్థితి అధికార పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. గతంలో ప్రత్యర్థి పార్టీకి మద్దతుగా ఉన్నవారికి పింఛన్లు అందుతున్నాయి.. ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన మాకు, మా సానుభూతిపరులకు కొత్త పింఛన్లు రాకపోతే మేమేం చేయాలి? అని కూటమి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. తమకు దక్కాల్సిన న్యాయం జరగకపోతే, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి సహకరించడం కష్టమని కిందిస్థాయి నాయకులు బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామం శ్రేణులను ఏకం చేయడంలో స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జ్‌లకు పెద్ద సమస్యగా పరిణమించింది. ఈ సంక్లిష్ట సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ఆరంచెల తనిఖీ, డిజిటల్ ఫిల్టరేషన్ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలో దాదాపు 1.42 లక్షల దరఖాస్తులను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల స్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయనే కారణంతో పక్కన పెట్టారు. భూమి పరిమితి, విద్యుత్ వాడకం, ఆదాయ పన్ను, నాలుగు చక్రాల వాహనాలు వంటి సాంకేతిక ప్రామాణికాలను కఠినతరం చేసి.. అర్హత లేని వారి దరఖాస్తులను సాంకేతిక కారణాలతో తిరస్కరించడం ద్వారా రాజకీయ కక్ష సాధింపు కాదు, నిబంధనల ప్రకారమే జరిగింది అని చెప్పే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందిఅంతేకాకుండా, ఒకే విడతలో అందరికీ పింఛన్లు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి, దశలవారీగా మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. మొదటి విడతలో అత్యంత పేదలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చి, మిగిలిన వారి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం ద్వారా తాత్కాలికంగా ఉపశమనం పొందాలని చూస్తోంది. అలాగే, పాత పింఛన్లలో తీవ్రమైన బోగస్, రీ-వెరిఫికేషన్‌లో తేలిన కొన్ని స్పష్టమైన అనర్హతల ఆధారంగా మాత్రమే తొలగింపులు చేపట్టి, ఆ ఖాళీలలో క్రమంగా కొత్త కార్యకర్తలు లేదా నిజమైన అర్హులను భర్తీ చేసే మార్గాన్ని అనుసరించే అవకాశం ఉంది. కొత్త పింఛన్ల అంశం ప్రభుత్వానికి ఒక వైపు ఆర్థిక భారాన్ని, మరోవైపు స్వపక్ష కార్యకర్తల ఆగ్రహాన్ని తెచ్చిపెట్టింది. సాంకేతిక కారణాలతో ఫిల్టర్ చేయడం వల్ల తాత్కాలికంగా సమర్థించుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉన్న నిజమైన అర్హులు, పార్టీ కార్యకర్తలను సంతృప్తి పరచడం కూటమి నాయకత్వానికి పెద్ద పరీక్షే. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ 'పింఛన్ల చిక్కుముడి'ని ప్రభుత్వం ఎలా విప్పుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# మైసూరు మించి దసరా ఉత్సవాలు..

## ఏడు రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం

**విజయవాడ అక్టోబరు 6, పెన్ పవర్:** దసరా అంటే మైసూర్ పేరు గుర్తుకు రావడం అత్యంత సహజం. రాజవంశ సంప్రదాయం ప్రకారం మైసూర్ ప్యాలెస్ లో విద్యుత్ దీపాలను అందంగా అలంకరిస్తారు. జంబు సవారి నిర్వహిస్తారు. ఏనుగుల ఊరేగింపు జరుపుతారు. ఇలా దశాబ్దాలుగా మైసూర్ ప్రాంతంలో దసరా వేడుకలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఇప్పుడు విజయవాడని కూడా దసరా టూరిజం డెస్టినేషన్ గా నిలబెట్టాలనే ప్రయత్నం జరుగుతోంది. తాజా పరిణామాలు దానిని సూచిస్తున్నాయి.అక్టోబర్ 11 నుంచి 20 వరకు విజయవాడ ఉత్సవ్ 2026 నిర్వహించబోతున్నారు. పున్నమి ఘాట్ కేంద్రంగా 10 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించబోతున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు.. జానపద కళలు.. సంగీతం.. ఫుడ్ ఫెస్టివల్.. దాండియా.. మెగా కార్నివాల్.. ఎగ్జిబిషన్లు.. వినోద కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దసరా వేడుకల మీద ప్రముఖంగా దృష్టి సారించారు.వన్ సిటీ వన్ సెలబ్రేషన్ కాన్సెప్ట్ తో విజయవాడ నగరాన్ని సాంస్కృతిక టూరిజం బ్రాండ్ గా తీర్చిదిద్దడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు.కనకదుర్గమ్మ దర్శనం.. విజయవాడ ఉత్సవ్.. నేషనల్ సరస్ మేళా.. ఇలా ఈ మూడింటిని కలిపి ఒకే టూరిజం ప్యాకేజీ లాగా మార్చి.. బయటి రాష్ట్రాల పర్యటకులను ఆకర్షించాలనేది లక్ష్యంగా కనిపిస్తోంది. పున్నమి ఘాట్ లో అక్టోబర్ 8 నుంచి 23 వరకు నేషనల్ సరస్ మేళా నిర్వహించబోతున్నారు.. మైసూర్ నుంచి ఏనుగులను విజయవాడకు తీసుకువచ్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఒక రకంగా ఇది మైసూరు దసరా వాతావరణాన్ని గుర్తుచేసే అంశం. ఇప్పుడంటే ఇప్పుడు కాకపోయినా.. విజయవాడ మైసూర్ ను అధిగమించే అవకాశం ఉంది. మైసూర్ ప్రాంతానికి 1610 సంవత్సరం నుంచి దసరా ఉత్సవాల చారిత్రక సంప్రదాయం ఉంది. అయితే విజయవాడకు కనకదుర్గమ్మ ఆలయం.. కృష్ణానది.. ఆధ్యాత్మికత.. తెలుగు సంస్కృతి అదనపు ఆకర్షణగా ఉంది.దసరా ఉత్సవాలను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఈ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం విజయ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హాజరవుతున్నారు.. దసరా ఉత్సవాల ద్వారా విజయవాడ బ్రాండ్ మరింత పెంచడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. తద్వారా పర్యాటకపరంగా ఏపీ రాష్ట్రానికి సరికొత్త గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తోంది.టూరిజం ద్వారా ఆదాయం భారీగా వస్తూ ఉంటుంది. కేరళ నుంచి మొదలు పెడితే కర్ణాటక వరకు టూరిజం ద్వారా భారీగా ఆదాయాన్ని అక్కడ ప్రభుత్వాలు ఆర్జిస్తూ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా పర్యాటకరపరంగా అనేక అనుకూలతలు ఉన్నాయి. అందువల్లే కూటమి ప్రభుత్వం పర్యాటకపరంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరికొత్త గుర్తింపు తీసుకురావడానికి.. మరింత ఉన్నత స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. అందువల్లే దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించింది. తద్వారా టూరిజం ఆదాయం తో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# శ్రేయస్ సూపర్ సెంచరీ.. విండీస్‌పై భారత్ ఘన విజయం

- కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 43 బంతుల్లో 102 పరుగులతో అజేయ శతకం
- 172 పరుగుల లక్ష్యాన్ని 14.4 ఓవర్లలోనే ఛేదించిన టీమిండియా
- ఇషాన్ కిషన్‌తో కలిసి అయ్యర్ 137 పరుగుల అజేయ భాగస్వామ్యం
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన భారత్




వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విధ్వంసకర సెంచరీతో కదం తొక్కాడు. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై, అయ్యర్ ఆడిన సుడిగాలి ఇన్నింగ్స్ ముందు వెస్టిండీస్ బౌలర్లు తేలిపోయారు. కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచిన అయ్యర్.. టీమిండియాకు అద్భుత విజయాన్ని అందించాడు. అతని బ్యాటింగ్ ధాటికి 172 పరుగుల లక్ష్యం చాలా చిన్నదిగా కనిపించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బ్యాటర్లలో షాయ్ హోప్ (52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (56) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో నమన్ ధీర్ 3 వికెట్లతో సత్తా చాటగా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (21), సంజూ శాంసన్ (11) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 35 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ క్లిష్ట దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. ఆట స్వరూపాన్నే మార్చేశాడు. వచ్చినప్పటి నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతనికి ఇషాన్ కిషన్ (37 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. ఒకవైపు అయ్యర్ బౌండరీల వర్షం కురిపిస్తుండగా, మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్ సంయమనంతో ఆడి వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు కేవలం 67 బంతుల్లోనే 137 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయ్యర్ తన కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షంగా మార్చేశాడు. ఫలితంగా భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఘన విజయం సాధించింది. తమ ఇన్నింగ్స్ లో మరో 20 పరుగులు చేసుంటే బాగుండేదని విండీస్ భావించినప్పటికీ, అయ్యర్ బ్యాటింగ్ తీరు చూశాక మరో 60 పరుగులు చేసినా కరీబియన్లు గెలవలేరని స్పష్టమైంది.ఇక ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఈ నెల 9న రాంచీలో జరగనుంది.

## పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు భారీ షాక్.. సగం ధరకే ప్రసార హక్కుల విక్రయం!




పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. తమ దేశంలో జరిగే 25 అంతర్జాతీయ మ్యాచ్‌ల ప్రసార హక్కులను నిర్ణయించిన ధర కంటే దాదాపు సగం ధరకే విక్రయించాల్సి వచ్చింది. ప్రసార హక్కుల కోసం ప్రభుత్వ టెలివిజన్ సంస్థ 'పాకిస్థాన్ టెలివిజన్ కార్పొరేషన్' (పీటీవీ) మాత్రమే బిడ్ దాఖలు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.పీసీబీ ఇటీవల ప్రసార హక్కుల కోసం టెండర్ జారీ చేసింది. దీనికి రూ.600 మిలియన్లను (పాకిస్థానీ రూపాయలు) రిజర్వ్ ధరగా నిర్ణయించింది. గతంలో మాదిరిగా పలు సంస్థలు కలిసి కన్సార్టియంగా బిడ్ వేసే అవకాశం ఈసారి ఇవ్వలేదు. దీంతో పోటీ తగ్గిపోయింది. చివరకు పీటీవీ రూ.350 మిలియన్లకు బిడ్ వేసి హక్కులను దక్కించుకుంది. అంటే బోర్డు నిర్ణయించిన ధరతో పోలిస్తే దాదాపు రూ.250 మిలియన్లు తక్కువకే హక్కులు విక్రయించాల్సి వచ్చింది.కొత్త ఒప్పందంలో మొత్తం 25 హోమ్ మ్యాచ్‌లు ఉన్నాయి. ఇందులో ఐదు టెస్టులు, 14 వన్డేలు, ఆరు టీ20లు ఉన్నాయి. ఈ నెలలో పాకిస్థాన్.. శ్రీలంకతో మూడు టీ20లు ఆడనుంది. ఆ తర్వాత ఇంగ్లాండ్‌తో కలిసి ఏడు మ్యాచ్‌ల ట్రై సిరీస్ జరగనుంది. వచ్చే నెలలో శ్రీలంకతో రెండు టెస్టులు కూడా ఉన్నాయి.

పాకిస్థాన్ జాతీయ జట్టు ఇటీవలి ప్రదర్శన అంతంతమాత్రంగానే ఉండటం వల్ల స్పాన్సర్లు, ప్రకటనదారులు క్రికెట్‌పై పెద్దగా ఆసక్తి చూపడం లేదని పీసీబీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు గతంలో కన్సార్టియంగా ప్రసార హక్కులు తీసుకున్న కనీసం మూడు సంస్థలు పీసీబీకి ఇంకా బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో ఈసారి బిడ్ వేసేందుకు ఆసక్తి చూపిన సంస్థల సంఖ్య భారీగా తగ్గిపోయింది.బకాయిలు ఉన్న సంస్థలను బిడ్డింగ్ నుంచి పీసీబీ నిషేధించలేదు. అయినా అవి స్వచ్ఛందంగా పోటీకి దూరంగా ఉన్నాయని సమాచారం. గతంలో పాకిస్థాన్ క్రికెట్ ప్రసార హక్కుల్లో ఎక్కువ భాగం దక్కించుకున్న ఓ సంస్థ కూడా ఈసారి ఆసక్తి చూపలేదు.ఇక 2027 జనవరిలో ఐర్లాండ్‌తో మూడు టీ20లతో పాటు ఐర్లాండ్, జింబాబ్వే పాల్గొనే ఏడు మ్యాచ్‌ల ట్రై సిరీస్ కూడా ఈ ప్రసార ఒప్పందంలో ఉంది. అయితే అంతర్గత బోర్డు సమస్యల కారణంగా పాకిస్థాన్ పర్యటనకు జింబాబ్వే వచ్చే పరిస్థితిలో లేదని ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది.

ఇటీవల పాకిస్థాన్ సూపర్ లీగ్ 11వ సీజన్ సమయంలోనూ పీసీబీకి ప్రసార హక్కుల విషయంలో ఆశించిన స్పందన రాలేదు. గత సీజన్ హక్కులు దక్కించుకున్న ఓ ప్రసార సంస్థ ఇప్పటికీ బోర్డుకు బకాయి పడినట్లు సమాచారం. దీంతో పాకిస్థాన్ క్రికెట్ ఆర్థిక పరిస్థితిపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## 'ప్లేయర్స్ కెప్టెన్.. వ్యూహాల్లో చాలా షార్ప్'.. శ్రేయస్‌పై లక్ష్మణ్ ప్రశంసలు




ఆసియా క్రీడల్లో భారత జట్టుకు స్వర్ణం అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై హెడ్ కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసలు కురిపించాడు. శ్రేయస్ ఆటగాళ్ల కెప్టెన్ అని కొనియాడాడు. ప్రతి ఆటగాడిని సౌకర్యంగా ఉంచుతూ, వారి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టే సామర్థ్యం ఉందని చెప్పాడు. కెప్టెన్‌గా అతడికి మంచి భవిష్యత్ ఉందని ఆశాభావం వ్యక్తం చేశాడు.జట్టు సమావేశాలకు ముందే శ్రేయస్ ప్రత్యర్థి బలాలు, బలహీనతలపై కసరత్తు చేస్తాడని లక్ష్మణ్ తెలిపాడు. ఫిట్‌నెస్‌కు కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తాడని చెప్పాడు. టీ20ల్లో ప్రత్యర్థి కంటే ఒకటి, రెండు అడుగులు ముందుండేలా వ్యూహాలు సిద్ధం చేసుకుంటాడని ప్రశంసించాడు.

జట్టులోని ప్రతి ఆటగాడి సామర్థ్యాన్ని శ్రేయస్ బాగా అర్థం చేసుకున్నాడని లక్ష్మణ్ అన్నాడు. పరిస్థితులకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకోవడంలో అతడు చాలా చురుకుగా ఉంటాడని పేర్కొన్నాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్‌లోనూ ముందుండి జట్టును నడిపిస్తాడని చెప్పాడు.

శ్రేయస్ నాయకత్వంలో భారత్ ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. ఫైనల్లో పాకిస్థాన్‌ను 19 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 211/6 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 28 బంతుల్లో 61 పరుగులు చేశాడు. తిలక్ వర్మ 22 బంతుల్లో అజేయంగా 51 పరుగులు సాధించాడు.లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 192/6కే పరిమితమైంది. హసన్ నవాజ్ 51 బంతుల్లో 96 పరుగులతో పోరాడాడు. చివరి బంతికి శివమ్ దూబే అతడిని ఔట్ చేయడంతో భారత్ స్వర్ణం ఖాయం చేసుకుంది.జపాన్‌లో ప్రతికూల వాతావరణం, ప్రయాణ సమస్యలు, సాధనకు తక్కువ సమయం ఉన్నా ఆటగాళ్లు అద్భుతంగా సర్దుకుపోయారని లక్ష్మణ్ చెప్పాడు. కఠిన పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంతో ఆడటం తనను ఆకట్టుకుందని తెలిపాడు. భారత క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవ లేదని పేర్కొన్నాడు.

# వెండితెర ప్రేమికులుగా రియల్ కపుల్స్







నిజజీవిత జంటలు వెండితెరపై అలరించడం ఎప్పుడూ ఒక ప్రత్యేక ఆకర్షణే. నిజ జీవితంలో ప్రేమించుకుని లేదా వివాహం చేసుకుని.. ఆ తర్వాత ఆన్-స్క్రీన్‌లోనూ జంటగా కనిపించి ప్రేక్షకులను అలరించిన జోడీల ట్రెండ్ ఇప్పుడు మరింత ఊపందుకుంటోంది. టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకమైన -రణబాలి- చిత్రంలో జంటగా నటిస్తూ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతున్నారు. అలాగే బాలీవుడ్‌లో కొత్తగా పెళ్లయిన సోనాక్షి సిన్హా- జహీర్ ఇక్బాల్ జంటగా నటిస్తున్న -తు హై మేరి కిరణ్- సినిమా ట్రైలర్ అక్టోబర్ 6న విడుదల కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు స్టార్ కపుల్స్ రణ్‌బీర్ కపూర్ - ఆలియా భట్ కూడా సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం -లవ్ అండ్ వార్- తో వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారు.ఈ కోవలోనే మరికొన్ని రియల్ లైఫ్ జోడీల ఆన్-స్క్రీన్ ప్రయాణం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే -షేర్షా- చిత్రంతో అందరినీ అలరించిన సిద్ధార్థ్ మల్హోత్రా- కియారా అద్వానీ జంట మరో కొత్త సినిమా కోసం సన్నాహాలు చేస్తున్నారనే వార్తలు ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. అలాగే గతంలో -మహాసముద్రం- చిత్రంలో కలిసి నటించిన సిద్ధార్థ్ - అదితి రావ్ హైదరీల జోడీ కూడా రియల్ లైఫ్‌లో ఒక్కటైన తర్వాత మరో కొత్త ప్రాజెక్ట్‌లో కలిసి నటిస్తారనే ఆసక్తి అభిమానుల్లో ఉంది. ఇలా నిజ జీవితంలో జంటగా ఉన్న నటీనటులు వెండితెరపై కూడా తమ కెమిస్ట్రీని రిపీట్ చేస్తుండటం సినిమాపై అదనపు క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది.ఇక టాలీవుడ్ విషయానికి వస్తే.. ఇటీవల వివాహబంధంతో ఒక్కటైన నాగచైతన్య - శోభిత ధూళిపాల జోడీని వెండితెరపై ఎప్పుడెప్పుడు చూస్తామా? అని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ రియల్ లైఫ్ జోడీని ఒకే ఫ్రేమ్‌లో చూడాలంటే ఏ దర్శకుడు సాహసం చేస్తారనే చర్చ టాలీవుడ్‌లో జోరుగా సాగుతోంది. త్వరలో అప్‌కమింగ్ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్న దర్శకుడు చందు మొండేటి లాంటి టాలెంటెడ్ డైరెక్టర్లు వీరిద్దరితో ఎలాంటి కథతో సినిమా తెస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మొత్తానికి రీసెంట్ టైమ్స్‌లో రియల్ జోడీల ఆన్-స్క్రీన్ రొమాన్స్ ప్రేక్షకులకు అంతులేని వినోదాన్ని పంచుతోంది.కాస్త సీనియర్లలో అక్కినేని నాగార్జున, అమల జంట విషయానికి వస్తే.. వీరు పెళ్లికి ముందే పలు చిత్రాల్లో జంటగా నటించి ప్రేక్షకులను ఎంతగానో అలరించారు. -కిరాయి దాదాలు-,-శివ-,-ప్రేమ యుద్ధం-, -అగ్ని పుత్రుడు- వంటి విజయవంతమైన చిత్రాల్లో వీరు కలిసి నటించారు. ఆ తర్వాత పరస్పరం ఇష్టపడి పెద్దల అంగీకారంతో 1992లో వివాహం చేసుకున్నారు. అయితే విశేషం ఏమిటంటే.. పెళ్లి అయిన తర్వాత అమల పూర్తి సమయం నటనకు దూరంగా ఉంటూ కేవలం వ్యక్తిగత జీవితం -జంతు సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. అందువల్ల వీరు పెళ్లి తర్వాత ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు.ఇక పలు చలనచిత్ర పరిశ్రమలలో (బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్) నిజ జీవితంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న నటీనటులు ఆన్-స్క్రీన్‌లోనూ జంటగా అలరించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. బాలీవుడ్‌లో రిషి కపూర్ - నీతూ కపూర్, అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్య రాయ్, అజయ్ దేవగణ్ - కాజోల్, అలాగే ఇటీవలి కాలంలో దీపికా పదుకొణె - రణ్‌వీర్ సింగ్ వంటి జంటలు తమ నిజ జీవిత బంధానికి ముందో లేదా ఆ తర్వాతో సినిమాల్లో జంటగా నటించి మెప్పించారు. అలాగే టాలీవుడ్‌లో మహేష్ బాబు - నమ్రత (పెళ్లికి ముందు -వంశీ- చిత్రంలో), కోలీవుడ్‌లో సూర్య - జ్యోతిక (కాకా కాక, చంద్రముఖి తదితర చిత్రాలు), అజిత్ - శాలిని (అమరకలం), మాలీవుడ్‌లో బిజు మీనన్ - సంయుక్త వర్మ వంటి ఎంతోమంది రియల్ కపుల్స్ వెండితెరపై కూడా ప్రేమికులుగా- భార్యాభర్తలుగా నటించి తమ అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులను అలరించారు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965